తెలంగాణ
TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | బుధవారం - 04 - ఫిబ్రవరి 2026 | సంపుటి:3 | సంచిక:247 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in

## మున్సిపల్ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా

# కాంగ్రెస్ వ్యూహం!

**పంచాయతీ ఎన్నికల్లో సాధించిన ఫలితాలను మున్సిపల్ ఎన్నికల్లోనూ పునరావృతం**

- మున్సిపల్ ఎన్నికల ప్రచార వ్యూహాలపై మంత్రులకు దిశానిర్దేశం చేసిన సీఎం
- సర్వే నివేదికలు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నాయని స్పష్టం
- చివరి వరకు అప్రమత్తంగా ఉండాలని, రెబల్స్‌ను రాజీ చేయాలని ఆదేశించారు.
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, ఫిబ్రవరి03(తెలంగాణ ముచ్చట్లు):** పంచాయతీ ఎన్నికల్లో సత్తా చాటినట్లే మున్సిపల్ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించాలని తన కేబినెట్ సహచర మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. మున్సిపల్ ఎన్నికల్లో ప్రచార వ్యూహాలపై మంత్రులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం చేశారు. మంగళవారం నాడు హైదరాబాద్‌లో తన కేబినెట్ మంత్రులతో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంపై వారితో సమీక్షించారు. ఈ ఎన్నికల్లో విజయంపై నివేదికలన్నీ కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగానే ఉన్నాయని వారికి సీఎం రేవంత్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వారికి సర్వే నివేదికలు అందజేశారు. అన్ని మున్సిపాలిటీల్లో గెలవబోతున్నామని జోస్యం చెప్పారు సీఎం రేవంత్. అయినా ఎన్నికల చివరి వరకు చాలా అప్రమత్తంగా ఉండాలని జాగ్రత్తలు చెప్పారు. ఇంకా ఎవరైనా రెబల్స్ ఉంటే.. వారిని రాజీ చేయాలని ఆదేశించారు. మంత్రులందరూ జిల్లాలకు వెళ్లాలని సూచించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. అలాగే సర్వేల్లో వెనకబడిన మున్సిపాలిటీలను ఈ సందర్భంగా మంత్రులకు ఆయన సోదాహరణగా వివరించారు.

మిగతా 2లో..



**హార్వర్డ్ కెనెడీ స్కూల్ లీడర్‌షిప్ కోర్సు పూర్తి చేసిన**

# సీఎంకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రులు

**హైదరాబాద్, ఫిబ్రవరి03 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీకి చెందిన కెనెడీ స్కూల్‌లో నిర్వహించిన 'లీడర్‌షిప్ ఇన్ ది 21వ శతాబ్దం' ఎగ్జిక్యూటివ్ లీడర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రివర్గ సహచరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ధనసరి అనసూయ సీతక్క, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, మహమ్మద్ అజారుద్దీన్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లి అభినందనలు తెలియజేశారు.



## హైదరాబాద్ రైల్వే హబ్‌గా మారనుంది: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

2లో

- 2026–27 బడ్జెట్ వికసిత్ భారత్–2047 లక్ష్యంతో
- ఉచితాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న రాజకీయ పార్టీలు
- సింగరేణిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ తీవ్ర విమర్శలు

## ఏఐఎంఐఎం నేత సయ్యద్ పాషా ఖాద్రీ మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

- సయ్యద్ పాషా ఖాద్రీ సేవలను గుర్తు చేసిన ముఖ్యమంత్రి
- మైనారిటీల సంక్షేమానికి విశేష కృషి చేశారని ప్రశంస
- కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి




**హైదరాబాద్, ఫిబ్రవరి03 (తెలంగాణ ముచ్చట్లు):** ఆల్ ఇండియా మజ్లిస్-ఎ-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) ప్రధాన కార్యదర్శి, చార్మినార్ మాజీ శాసన సభ్యుడు సయ్యద్ పాషా ఖాద్రీ గారి మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ప్రజా జీవితానికి తీరని లోటని సీఎం పేర్కొన్నారు. హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్‌గా, అలాగే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా సేవలందించిన సయ్యద్ పాషా ఖాద్రీ మైనారిటీల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఆయన చురుకైన పాత్ర పోషించారని తెలిపారు. చార్మినార్ నియోజకవర్గ అభివృద్ధికి, సామాజిక న్యాయ సాధనకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని సీఎం రేవంత్ రెడ్డి కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మేలు కోసం పనిచేసిన నేతగా సయ్యద్ పాషా ఖాద్రీ ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. సయ్యద్ పాషా ఖాద్రీ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి, తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ కఠిన సమయంలో ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.

# విచారణకు వేళాయె...!

## నేడు కడియంను విచారించనున్న స్పీకర్

### స్పీకర్ నిర్ణయం పై ఉత్కంఠ





**హైదరాబాద్, ఫిబ్రవరి03 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ రాజకీయం ఆసక్తి కరంగా మారుతోంది. మున్సిపల్ ఎన్నికలు.. ఫోన్ ట్యాపింగ్ కేసు.. మరో వైపు ఎమ్మెల్యే అనర్హత కేసు లతో సమీకరణాలు మారుతున్నాయి. కొత్త రాజకీయం తెర మీదకు వస్తోంది. బీఆర్ఎస్ నుంచి గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ లో చేరటంతో వారి పైన అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ ఫిర్యాదు చేసింది. ఏడుగురికి క్లీన్ చిట్ ఇచ్చిన స్పీకర్ మిగిలిన ముగ్గురి విషయంలోనూ వివరణ తీసుకుంటున్నారు. ఇక, ఇప్పుడు స్పీకర్ మరో ఎమ్మెల్యే విషయంలో నిర్ణయానికి సిద్ధమయ్యారు.

ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. ఈనెల 4న (బుధవారం) ఉదయం 11గంటలకు విచారణకు హాజరు కావాల్సిందిగా స్పీకర్ ఆదేశించారు. కడియం శ్రీహరి బీఆర్ఎస్ పార్టీ గుర్తుపై విజయం సాధించింది కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద స్పీకర్‌కు ఫిర్యాదు చేసారు. దీంతో, బుధవారం ఉదయం 11 గంట లకు జరగబోయే విచారణకు హాజరు కావాలని వివేకానందకు కూడా స్పీకర్ నోటీసులు జారీ చేశారు. కడియం శ్రీహరి, వివేకానంద వాదనలను స్పీకర్ ప్రసాద్ కుమార్ వివరణ తీసుకునే అవకాశం ఉంది. కాగా.. పార్టీ ఫిరాయింపుల కేసులో భాగంగా.. పది మంది ఎమ్మెల్యేల ఫిరాయింపు పిటిషన్లు తన ముందుకు రాగా.. ఇప్పటికే ఏడుగురికి స్పీకర్ ప్రసాద్ కుమార్ క్లీన్ చిట్ ఇచ్చారు. వారు బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నారని, కాంగ్రెస్ పార్టీలో చేరలేదని తీర్పు ఇచ్చారు. అయితే, దానం నాగేందర్ పిటిషన్ విచారణ దశలో ఉంది.

మిగతా 2లో..

## మున్సిపాలిటీలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రచారం



అందూర్, సోలక్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ

కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు.. బీజేపీ మాత్రమే ప్రజల పక్షాన నిలుస్తుందన్న రఘునందన్ రావు

2లో

## బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. డ్రైనేజీలో వేసినట్లే..

- కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ పైసలు ఎక్కడి నుంచి తెస్తది ?
- ఆరు గ్యారంటీలను అమలు చేయని కాంగ్రెస్ ఎందుకు ఓటేయాలి ?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి సంజయ్



2లో

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# హైదరాబాద్ రైల్వే హబ్‌గా మారనుంది: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

- **2026–27 బడ్జెట్ వికసిత్ భారత్–2047 లక్ష్యంతో ఉచితాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్న రాజకీయ పార్టీలు**
- **సింగరేణిపై బీఆర్ఎస్, కాంగ్రెస్ తీవ్ర విమర్శలు**

**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** హైదరాబాద్ దేశంలోనే కీలక రైల్వే హబ్‌గా రూపాంతరం చెందబోతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. నగరంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2026-27 కేంద్ర బడ్జెట్ ఎన్నికల దృష్టితో కాకుండా 'వికసిత్ భారత్-2047' దీర్ఘకాలిక లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకొని రూపొందించిందని స్పష్టం చేశారు. ప్రజలు ఆశించే సుస్థిర ప్రగతికి ఈ బడ్జెట్ బాటలు వేసిందన్నారు. బడ్జెట్ అంటే కేవలం ఉచిత పథకాల కోసమే అన్నట్లుగా కొన్ని రాజకీయ పార్టీలు ప్రజల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నాయని కిషన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఈ బడ్జెట్ మౌలిక వసతులు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధిపై దృష్టి పెట్టిందని తెలిపారు. గ్రామీణ, పట్టణాభివృద్ధికి సమతుల్య ప్రాధాన్యం ఇచ్చిన బడ్జెట్ ఇదని పేర్కొన్నారు. వీబీ జీ రామ్ జీ ద్వారా ఉపాధి హామీ పథకం నిర్వీర్యమైందని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని కిషన్ రెడ్డి ఖండించారు. ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో 9 శాతం నిధులు కేటాయించినట్లు తెలిపారు. అలాగే ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద తెలంగాణకు 4.30 లక్షల ఇళ్లను కేటాయించామని, మేడారం జాతరకు కేంద్ర ప్రభుత్వం రూ.3.70 కోట్లు మంజూరు చేసిందని వివరించారు. నైనీ బొగ్గు గనుల వ్యవహారంలో తెలంగాణ మంత్రులు రెండు వర్గాలుగా విడిపోయారని విమర్శించిన కిషన్ రెడ్డి, బీఆర్ఎస్, కాంగ్రెస్ దగాల వల్లే సింగరేణి సంస్థ భ్రష్టుపట్టిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో సింగరేణిని ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీగా మార్చారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అది కాంగ్రెస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ప్రజా సంపదను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నారని ఆయన విమర్శించారు.

# మున్సిపాలిటీలో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రచారం





- **అండూర్, సోలక్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీ**
- **కాంగ్రెస్‌పై తీవ్ర విమర్శలు**
- **బీజేపీ మాత్రమే ప్రజల పక్షాన నిలుస్తుందన్న రఘునందన్ రావు**

**జిన్నారం,(తెలంగాణ ముచ్చట్లు):** జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని అండూర్, సోలక్‌పల్లి ప్రాంతాల్లో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు పాల్గొన్నారు. ఇంటింటి ప్రచారం, ప్రజలతో ప్రత్యక్ష సంభాషణల ద్వారా బీజేపీకి మద్దతు కోరారు. ఈ సందర్భంగా రఘునందన్ రావు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ వద్ద డబ్బులు ఉండొచ్చని, కానీ ప్రజల నమ్మకం బీజేపీ వద్దే ఉందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు భయపడాల్సిన అవసరం లేదని, ఇంకా గట్టిగా పనిచేసి బీజేపీని గెలిపించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆపదలో ప్రజల పక్కన నిలబడేది బీజేపీ మాత్రమేనని, ధర్మం, న్యాయం కోసం నిలబడిన పార్టీ బీజేపీ అని స్పష్టం చేశారు. అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్న పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన అన్నారు. పదేళ్లుగా పాలించిన కాంగ్రెస్ ప్రజల కోసం ఏమీ చేయలేదని, ఇప్పుడు మాటలకే పరిమితమైందని విమర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, స్కూటీలు, పింఛన్ల పెంపు వంటి హామీలు అమలు కాలేదని, ప్రజలకు లక్ష ఇరవై వేల రూపాయల బాకీ కాంగ్రెస్‌పై ఉందని ఆరోపించారు.

రియల్ ఎస్టేట్, క్రషర్లు, అవినీతి డబ్బులతో కాంగ్రెస్ నేతలు బిజీగా ఉన్నారని, ప్రజల కోసం నిజంగా పని చేసేది బీజేపీ నాయకులేనని రఘునందన్ రావు అన్నారు. ప్రస్తుతం మీ కోసం ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీగా తాను ఉన్నానని తెలిపారు. కాంగ్రెస్‌లో అంతర్గత కలహాలే ఎక్కువగా ఉన్నాయని, ప్రజల సమస్యలపై పనిచేసే సమయం వారికి లేదని వ్యాఖ్యానించారు.

# మంథని మాజీ ఎమ్మెల్యే చంద్రుపట్ల రాంరెడ్డి మృతి పట్ల సీఎం రేవంత్ రెడ్డి సంతాపం

**మంథని,(తెలంగాణ ముచ్చట్లు):** మంథని మాజీ శాసనసభ్యుడు చంద్రుపట్ల రాంరెడ్డి గారి మరణం పట్ల ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆయన మరణం ప్రజా జీవితానికి తీరని లోటని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్‌గా ప్రజా సేవ ప్రారంభించిన చంద్రుపట్ల రాంరెడ్డి శాసనసభ్యుడిగా ఎదిగి, నియోజకవర్గ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేశారని సీఎం గుర్తు చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ముందుండి పనిచేసిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు సంపాదించారని తెలిపారు. మంథని ప్రాంత అభివృద్ధికి, ప్రజల అవసరాల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల మేలు కోసం పనిచేసిన వ్యక్తిగా రాంరెడ్డి గారు అందరి మన్ననలు పొందారని పేర్కొన్నారు. చంద్రుపట్ల రాంరెడ్డి గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతి, తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈ కఠిన సమయంలో ప్రభుత్వం వారి కుటుంబానికి అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు.






# ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అభ్యర్థులకు బీ–ఫామ్‌లు

- **మిరియాల రామకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ**
- **ఎన్నికల బరిలో నిలిచిన ఆరు వార్డుల అభ్యర్థులు**
- **ఖమ్మం నియోజకవర్గ జనసేన నేతల పాల్గొనడం**

ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న జనసేన పార్టీ అభ్యర్థులకు బీ-ఫామ్‌ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా జనసేన పార్టీ మున్సిపల్ కోఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు అధికారికంగా బీ-ఫామ్‌లు అందజేసి ప్రచారానికి సిద్ధం కావాలని సూచించారు.

ఈ సందర్భంగా నాలుగో వార్డులో కొమ్ము లక్ష్మి, ఏడో వార్డులో జార్పుల నీలిమ, ఇరవై ఏడో వార్డులో బాణోత్ రఘు, ఇరవై ఎనిమిదో వార్డులో దండి సుధాకర్, ఇరవై తొమ్మిదో వార్డులో హనుమంతు మౌనికతో పాటు ఇతర అభ్యర్థులకు పార్టీ తరపున బీ-ఫామ్‌లు అందజేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అభ్యర్థులు ప్రజల సమస్యలపై పోరాడేందుకు సిద్ధంగా ఉండాలని నేతలు పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో ఖమ్మం నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు బండారు రామకృష్ణ, యసంనేని అజయ్, తుడం ఉత్తమ్ రాజు, బనోత్ దేవేందర్, షేక్ హసీనా, రమణ కుమార్, అఖిల్, గంగాధర్, విజయ్, రాకేష్ చారి తదితరులు పాల్గొన్నారు. పార్టీ శ్రేణులు అభ్యర్థులకు సంఘీభావం తెలుపుతూ ప్రచారంలో సమిష్టిగా పని చేయాలని నిర్ణయించారు.

ఏదులాపురం మున్సిపాలిటీలో జనసేన పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని నేతలు తెలిపారు. ప్రతి వార్డులో ప్రజల సమస్యలను ప్రధానంగా తీసుకుని ఎన్నికల ప్రచారం నిర్వహించి, గెలుపే లక్ష్యంగా పని చేయాలని అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు.

# విచారణకు వేళాయె...!

(మొదటి పేజీ తరువాయి)

కాగా, ఇప్పుడు కడియం శ్రీహరి పిటిషన్ ను బుధవారం విచారించనున్నారు. మరో ఎమ్మెల్యే సంజయ్ వ్యవహారంపై స్పీకర్ ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికల్లో గులాబీ గుర్తుపై గెలిచిన కడియం శ్రీహరి, రాష్ట్రంలో మారిన రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తన కుమార్తె కావ్య భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కారు గుర్తుపై గెలిచి హస్తం గూటికి చేరడం నిబంధనలకు విరుద్ధమని, ఆయనపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద స్పీకర్కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును స్వీకరించిన స్పీకర్ కార్యాలయం, సహజ న్యాయ సూత్రాల ప్రకారం ఇరు పక్షాల వాదనలు వినాలని నిర్ణయించింది. ఈ క్రమంలోనే కడియం శ్రీహరితో పాటు, ఫిర్యాదుదారుడైన వివేకానందకు కూడా నోటీసులు అందాయి. నేటి విచారణలో ఫిరాయింపునకు సంబంధించిన ఆధారాలను వివేకా సమర్పించనున్నారు. దీంతో.. కడియం పైన స్పీకర్ నిర్ణయం ఏంటనేది ఆసక్తి గా మారుతోంది.

# మున్సిపల్ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కాంగ్రెస్ వ్యూహం!

(మొదటి పేజీ తరువాయి)

అదే విధంగా జిల్లాల పర్యటన వివరాలను మంత్రులను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జిల్లా ఇంఛార్జ్ మంత్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోజు వారి రిపోర్ట్ తనకు అందించాలని ఈ సందర్భంగా మంత్రులకు స్పష్టం చేశారు. ఇక అసంతృప్తి నేతలను బుజ్జగించాలని మంత్రులకు సీఎం రేవంత్ సూచించారు. తెలంగాణ రాష్ట్రంలోని వివిధ మున్సిపాలిటీలతోపాటు పలు మున్సిపల్ కార్పొరేషన్లకు ఫిబ్రవరి 11వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన షెడ్యూల్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. ఈ ఎన్నికల్లో నామినేషన్ల ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. నామినేషన్ల విత్ డ్రా సైతం నేటితో ముగిసింది.


# బీఆర్ఎస్‌కు ఓటేస్తే.. డ్రైనేజీలో వేసినట్లే..

**కరీంనగర్ ఫిబ్రవరి03 (తెలంగాణ ముచ్చట్లు):**

మున్సిపల్ ఎన్నికల్లో ఎవరైనా పొరపాటున బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే డ్రైనేజీలో వేసినట్లేనని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో అధికారంలో లేని బీఆర్ఎస్ కరీంనగర్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం నిధులు ఎక్కడి నుంచి తెస్తుందని ప్రశ్నించారు. తాను కేంద్రం నుంచి నిధులు తీసుకొస్తే.. బీఆర్ఎస్ నేతలు కొబ్బరికాయ కొట్టి.. ఆ నిధులు తామే తెచ్చామని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం కరీంనగర్‌లోని కిసాన్‌నగర్, కాపువాడ, మారుతీనగర్ చౌరస్తాలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో బండి సంజయ్ మాట్లాడారు. అవినీతి, అరాచకాలు, కబ్జాలతో పదేండ్లు ప్రజలను అరిగోస పెట్టిన బీఆర్ఎస్‌కు ఎందుకు ఓటు వేయాలని ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికలు అయిపోయిన వెంటనే ఇంటి పన్ను పెంచి ప్రజల నడ్డి విరిచేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఆరు గ్యారంటీలతో పాటు మేనిఫెస్టో పేరుతో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్‌కు ఓటు వేయొద్దన్నారు. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఎన్నికలప్పుడే తప్ప తర్వాత ఎన్నడూ కన్పించలేదని, ప్రజలు ఆయనను ఎన్నడో మర్చిపోయారన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే మరిన్ని నిధులు తీసుకొచ్చి కరీంనగర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాల

**తెలంగాణ పోలీసుల హెచ్చరిక**




**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):** పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, అనుమానాస్పద యాప్‌ల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ నంబర్ 1930కు కాల్ చేయాలని పోలీసులు తెలిపారు. అలాగే, సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు నమోదు చేస్తే మోసపోయిన డబ్బును తిరిగి పొందే అవకాశం ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. తెలియని లింకులపై క్లిక్ చేయడం, అపరిచితులకు ఓటీపీలు, బ్యాంక్ వివరాలు, ఏటీఎం పిన్‌లు, ఆధార్ వివరాలు ఇవ్వడం ప్రమాదకరమని పోలీసులు స్పష్టం చేశారు. సోషల్ మీడియా, వాట్సాప్, ఇమెయిల్ ద్వారా వచ్చే ఆకర్షణీయ ఆఫర్లను నమ్మవద్దని సూచించారు. సైబర్ నేరాల నివారణ ప్రతి పౌరుడి బాధ్యత అని తెలంగాణ పోలీసులు తెలిపారు. అనుమానం వచ్చిన ప్రతీసారి అప్రమత్తంగా వ్యవహరించాలని, అవసరమైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచిస్తూ ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు.



# ఘనంగా సంగాల ప్రేమ్ జయంతి

◆ లార్డ్ వృద్ధాశ్రమంలో అన్నదానం

హసన్ పర్తి, ఫిబ్రవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):

గ్రేటర్ పరిధిలోని 55 డివిజన్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు (దివంగత) సంగాల ప్రేమ్ కుమార్ జన్మదిన వేడుకలు పెండ్యాల వీనస్ ఆధ్వర్యంలో భీమారం ఇందిరాగాంధీ విగ్రహం వద్ద పార్టీలకు అతీతంగా ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డివిజన్ కార్పొరేటర్ జక్కుల రజిత వెంకటశ్వర్లు హాజరై ప్రేమ్ కుమార్ జన్మదిన కేక్ ను కట్ చేశారు.ఈ సందర్భంగా పలువురు భీమారం వాసులతో కలిసి స్వీట్లు, పండ్లు పంపిణి చేశారు. అనంతరం కుటుంబ సభ్యులు ఆధ్వర్యంలో భీమారం పలి వేల్పుల రోడ్డులో గల లార్డు వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు బుర సారంగపాణి,మచ్చా వెంకటస్వామి,భీమారం కాంగ్రెస్ అధ్యక్షుడు డైని,డివిజన్ కాంగ్రెస్ నాయకుడు సంగాల పరమేష్,సంగాల చిట్టిబాబు,మాజీ కూడా డైరెక్టర్ నన్నే బోయిన రమేష్ యాదవ్,పరిశుద్ధాత్మ దేవాలయ ఫాదర్లు,ప్రెసిడెంట్ సంగాల రవి,పంతులు సంగాల బాబు,రేణికుంట్ల సురేష్,నమిండ్ల అరుణ్,మాదిగ కుల సంఘ అధ్యక్షుడు సంగాల కోటేశ్వర్, కొండపలకల భాస్కర్,బొక్క కిరణ్,సంగాల వీనస్, ఇమ్మడి కొమరయ్య,ఆటో యూనియన్ అధ్యక్షుడు కావటి సంపత్, తోట రమేష్,సంగాల రాజేష్,సంగాల అనురూప్,కిషోర్,జక్కుల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.





# "పార్టీ కాదు, వ్యక్తి ముఖ్యం"

◆ సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో కొత్త రాజకీయ సమీకరణం

సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):

ఈసారి సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో గెలుపు సాధించాలంటే కేవలం పార్టీ గుర్తుపై ఆధారపడడం సరిపోకుండా, అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్ట, ప్రజలతో అనుబంధం ముఖ్యమైందని రాజకీయ వర్గాలు సూచిస్తున్నాయి. గతంలో ఓటర్లు ఎక్కువగా పార్టీ గుర్తును మాత్రమే చూసి ఓటు వేస్తే, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఉంది. ప్రజలు అభ్యర్థి వ్యక్తిత్వం, అందుబాటు, సమస్యలపై స్పందన వంటి అంశాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి వార్డులో అభ్యర్థులు స్వయంగా ప్రజలను కలవడం, సమస్యలు వినడం, స్థానికంగా అందుబాటులో ఉండడం తప్పనిసరి అయింది.

మహిళా ఓటర్ల ప్రభావం గణనీయంగా పెరిగిన సంగతి మరో ప్రధాన మార్పుగా కనిపిస్తోంది. సంక్షేమ పథకాలు, కుటుంబ అవసరాలు, భద్రత, తాగునీరు, వీధి దీపాలు, ఆరోగ్యం వంటి అంశాలపై మహిళలు స్పష్టమైన అభిప్రాయంతో ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారు. కాబట్టి మహిళల సమస్యలను తెలుసుకుని, వారితో ప్రత్యక్ష సంభాషణలు జరుపగల అభ్యర్థులు గెలుపులో ముందుంటారు.

రాష్ట్ర రాజకీయ విశ్లేషకులు అంటున్నట్లే, ఈసారి సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో "పార్టీ కాదు... వ్యక్తి ముఖ్యం" "ప్రచారం కాదు...ప్రజలతో అనుబంధం ముఖ్యం"

అనే కొత్త రాజకీయ ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.

# మున్సిపాలిటీ అభ్యర్థులకు బీ–ఫారాలు అందజేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య

◆ స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతాం

స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మంగళవారం స్టేషన్ ఘనపూర్ పట్టణ కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మున్సిపల్ ఎన్నికలలో పోటీ చేస్తున్న అభ్యర్థులకు పార్టీ బీ-ఫారాలను అందజేశారు.

బీ-ఫారాలు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు వాటిని సమర్పించాలని ఎంపీ సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజారంజక పాలన, గ్యారంటీ పథకాలను ఇంటింటికీ తీసుకెళ్లి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు. వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రచారాన్ని ముమ్మరం చేయాలని, ప్రత్యర్థుల వ్యూహాలను సమర్థంగా ఎదుర్కోవాలని దిశానిర్దేశం చేశారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలోని పద్దెనిమిది వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులే గెలుపు సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు.

అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, మున్సిపాలిటీ ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనే స్టేషన్ ఘనపూర్‌కు మున్సిపాలిటీ హోదా లభించిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి అహర్నిశలు శ్రమించి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు.







ఇప్పటికే మున్సిపాలిటీలో యాభై కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలిచిన అనంతరం మరో యాభై కోట్ల రూపాయలతో అదనపు అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. స్టేషన్ ఘనపూర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకోలేనిదని, అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు. పద్దెనిమిది వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగరాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నియోజకవర్గంలో సాగునీరు, విద్య, వైద్య, వ్యవసాయం, విద్యుత్ రంగాల్లో విస్తృత అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా ప్రతి ఎకరాకు రెండు పంటలకు సాగునీరు అందిస్తున్నామని, వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం, గురుకుల పాఠశాలల అభివృద్ధి, విద్యుత్ ఉపకేంద్రాల నిర్మాణం, రహదారులు, కాలువలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలతో పట్టణం రూపురేఖలు మారుతున్నాయని వివరించారు.

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని, పార్టీ సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ఎంపిక చేశామని తెలిపారు. పార్టీ నిర్ణయానికి అందరూ కట్టుబడి ఉండాలని, అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ - కాంగ్రెస్ పార్టీ వార్డుల వారీ అభ్యర్థుల జాబితా

- మొదటి వార్డు - అభ్యర్థి పేరు ప్రకటించలేదు
- రెండవ వార్డు - అభ్యర్థి పేరు ప్రకటించలేదు
- మూడవ వార్డు - గుర్రం హైమ, రమేష్ భార్య (ఎస్సీ - మహిళ)
- నాలుగవ వార్డు - బూర్ల శంకర్, మల్లయ్య కుమారుడు (బీసీ - పురుషుడు)
- ఐదవ వార్డు - కొంతం రజిత, శ్రీనివాస్ భార్య (సాధారణ - మహిళ)
- ఆరవ వార్డు - కనకం రమేష్, సుదర్శన్ కుమారుడు (సాధారణ - పురుషుడు)
- ఏడవ వార్డు - అన్నెపు సుమలత, కుమార్ భార్య (బీసీ - మహిళ)
- ఎనిమిదవ వార్డు - అభ్యర్థి పేరు ప్రకటించలేదు
- తొమ్మిదవ వార్డు - అభ్యర్థి పేరు ప్రకటించలేదు
- పదవ వార్డు - తోకల అనూష, రాజు భార్య (ఎస్సీ - మహిళ)
- పదకొండవ వార్డు - నీల రాజమ్మ, గట్టయ్య భార్య (సాధారణ - మహిళ)
- పన్నెండవ వార్డు - గట్టు సంగీత, రమేష్ భార్య (సాధారణ - మహిళ)
- పదమూడవ వార్డు - అభ్యర్థి పేరు ప్రకటించలేదు
- పద్నాలుగవ వార్డు - పెసరు కృష్ణవేణి, సారయ్య భార్య (సాధారణ - మహిళ)
- పదిహేనవ వార్డు - బొల్లు లక్ష్మి, సాయిలు భార్య (సాధారణ - మహిళ). బరిలో ఉన్నారు.

# బిఆర్ఎస్ అభ్యర్థులకు బి–ఫారమ్‌ల అందజేత

◆ సత్తుపల్లిలో మళ్లీ అభివృద్ధి జెండా ఎగరేయాలి

◆ సండ్ర వెంకట వీరయ్య

సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):

సత్తుపల్లి మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సండ్ర వెంకట వీరయ్య మంగళవారం బి-ఫారమ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ పాలనలో సత్తుపల్లిలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల మనసుల్లో బలంగా నిలిచాయని అన్నారు. మౌలిక వసతులు, రహదారులు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర రంగాల్లో చేసిన అభివృద్ధిని ప్రజలు ఇప్పటికీ గుర్తుచుకున్నారని పేర్కొన్నారు. మరోసారి మున్సిపాలిటీలో బిఆర్ఎస్ జెండా ఎగరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్రమశిక్షణతో సమిష్టిగా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రతి వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించి, పార్టీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి వార్డులో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి, సత్తుపల్లిని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు ప్రజలు ఆశీర్వదించాలని ఆయన కోరారు.



ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, మున్సిపల్ ఎన్నికల ఇన్‌చార్జిలు, వార్డు స్థాయి నాయకులు, స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉప్పల్‌లో కాంగ్రెస్ పార్టీలో భారీ చేరికలు

ఉప్పల్, ఫిబ్రవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):


ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకూ ప్రజల మద్దతు పెరుగుతూ భారీ చేరికలు కొనసాగుతున్నాయి. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో పలువురు కాలనీ పెద్దలు, యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఉప్పల్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ మార్కెట్ కాలనీకి చెందిన పెద్దలు హనుమంత్ రెడ్డి, జి. అబ్రహం, బాలరాజు, నర్సింగరావు, అమరనాథ్‌తో పాటు గాంధీ నగర్ యూత్ అసోసియేషన్‌కు చెందిన శేఖర్, శివకుమార్, సాయి రెడ్డి, మనోజ్, చింతా భరత్, నర్సింహా, మల్లేష్, చిన్న,

**కొత్తగా చేరిన నాయకులు, యువకులకు కండువాలు కప్పి ఆహ్వానించిన మందుముల పరమేశ్వర్ రెడ్డి**



మహేందర్, దేవేందర్, శివ, కిరణ్, క్రాంతి, మల్లి కళ్యాణ్, భాస్కర్, అంబికా, అశ్విని తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా మందుముల పరమేశ్వర్ రెడ్డి నూతనంగా చేరిన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి విధానాల పట్ల ప్రజలు ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని ఆయన తెలిపారు. రానున్న రోజుల్లో ఉప్పల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలపడుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బజార్ జగన్నాథ్ గౌడ్, ఉప్పల్ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, కంది శ్రవణ్ రెడ్డి, విజయ్ కుమార్, రాజన్న, జావిద్, గౌరిగే జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర బడ్జెట్‌లో గిరిజనులకు అన్యాయం



◆ తెలంగాణ గిరిజన సంఘం హనుమకొండ జిల్లా నాయకులు

హన్మకొండ,ఫిబ్రవరి03(తెలంగాణ ముచ్చట్లు):

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2026-27 బడ్జెట్‌లో గిరిజనుల అభివృద్ధి, సంక్షేమానికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలంగాణ గిరిజన సంఘం హనుమకొండ జిల్లా కమిటీ ఆరోపించింది. పార్లమెంటులో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ కేటాయింపులు గిరిజనులను మరింత పేదరికంలోకి నెట్టేలా ఉన్నాయని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి. వీరన్న నాయక్, అధ్యక్షుడు పల్లకొండ శ్రీకాంత్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

గత ఆర్థిక సంవత్సరంలో గిరిజన సంక్షేమానికి 14,925 కోట్ల రూపాయలు కేటాయించగా, సవరించిన అంచనాల్లో 4,101 కోట్ల రూపాయలు తగ్గించి కేవలం 10,824 కోట్ల రూపాయలకే పరిమితం చేశారని తెలిపారు. 2026-27 బడ్జెట్‌లో 15,421 కోట్ల రూపాయలు కేటాయించినప్పటికీ, గత బడ్జెట్‌తో పోలిస్తే కేవలం 496 కోట్ల రూపాయల పెరుగుదల మాత్రమే ఉండటం గిరిజనుల సంఖ్య, అవసరాలకు సరిపడదని విమర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 15 కోట్ల మంది ఆదివాసీ గిరిజనుల సంక్షేమం ఇంత స్వల్ప కేటాయింపులతో ఎలా సాధ్యమవుతుందో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

మొత్తం 53,47,315 కోట్ల రూపాయల కేంద్ర బడ్జెట్‌లో గిరిజన జనాభా నిష్పత్తి ప్రకారం రాజ్యాంగబద్ధంగా గిరిజన సబ్‌ప్లాన్‌కు కేటాయించాల్సిన నిధులను అంకెల గారడీకి గురిచేశారని ఆరోపించారు. గిరిజనుల అభివృద్ధికి నేరుగా ఉపయోగపడే రంగాల్లో కేటాయింపులు తగ్గించి, కార్పొరేట్లు, పెద్ద కాంట్రాక్టర్లు, ధనవంతులకు లాభం చేకూరే రంగాల్లో మాత్రం అధిక నిధులు వెచ్చిస్తున్నారని విమర్శించారు.

ఉన్నత విద్యలో గిరిజన విద్యార్థులకు కీలకమైన ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు గత ఏడాది సవరించిన అంచనాల కంటే కూడా నిధులు తగ్గించడం ఆందోళనకరమని తెలిపారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పథకాల పేర్లు పెట్టడం, మార్చడం తప్ప గిరిజనులకు వాస్తవంగా ఒరిగిందేమీ లేదని విమర్శించారు.

ధరిత్రి ఆబా జన్ జాతీయ గ్రామ వికాస్ అభ్యాన్‌కు గత ఏడాది 2,000 కోట్ల రూపాయలు కేటాయించి, సవరించిన అంచనాల్లో 1,500 కోట్లకు తగ్గించి, ఈ ఏడాది 2,013 కోట్ల రూపాయలు మాత్రమే కేటాయించడాన్ని ఉదాహరణగా పేర్కొన్నారు.

రాజ్యాంగంలోని 275(1) అధికరణ ప్రకారం షెడ్యూల్డ్ ప్రాంతాల గిరిజనుల అభివృద్ధికి గ్రాంట్‌గా ఇవ్వాల్సిన నిధులను పెంచకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అన్నారు. గత ఏడాది 1,541 కోట్ల రూపాయలు కేటాయించగా, ఈ ఏడాది కేవలం ఒక రూపాయి పెంచి 1,542 కోట్లుగా చూపడం అంకెల గారడీగానే మిగిలిందని వ్యాఖ్యానించారు.

దేశవ్యాప్తంగా గిరిజన తెగల్లో పెరుగుతున్న నిరుద్యోగాన్ని తగ్గించేందుకు చిన్న పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి రంగాల్లో తగిన నిధులు కేటాయించకపోవడం బాధాకరమని తెలిపారు. గిరిజనుల్లో పేదరికం, అనారోగ్యం పెరుగుతోందని ఐక్యరాజ్యసమితి ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో, ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరచే చర్యలు గిరిజనులపై తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు.

తెలంగాణలో గిరిజన విశ్వవిద్యాలయం నిర్మాణంపై ఇప్పటికీ స్పష్టత ఇవ్వకపోవడం ప్రధానమంత్రి ఇచ్చిన హామీని విస్మరించినట్టేనని వి. వీరన్న నాయక్ పేర్కొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



## వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల్లో కాంగ్రెస్ జెండా ఎగరవేత ఖాయం

- ఎనిమిదేళ్లు కాంగ్రెస్ పాలన కొనసాగుతుంది
- ఎమ్మెల్యే మేఘారెడ్డి


**వనపర్తి ,ఫిబ్రవరి3(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రస్తుతం జరుగుతున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీలపై కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి స్పష్టం చేశారు.ఎనిమిదేళ్ల పాటు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.మంగళవారం వనపర్తి పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు కొత్తకాపు శివసేనారెడ్డి, చిన్నారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులకు బీఫాంలు అందజేశారు.వనపర్తి పట్టణంలోని ముప్పై మూడు వార్డుల్లో ముప్పై మూడు వార్డులు, పెబ్బేరు మున్సిపాలిటీలోని పన్నెండు వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే ఘన విజయం సాధిస్తారని తెలిపారు. ప్రజలు ప్రతిపక్షాలను నమ్మే పరిస్థితి లేదని, గత కాలంలో ప్రతిపక్ష నాయకులే లాభపడగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ఇందిరమ్మ పాలనలో నిరుపేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తరఫున బీఫాం పొందిన ప్రతి కౌన్సిలర్ అభ్యర్థిని తప్పకుండా గెలిపించి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శివసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- అల్వాల్ ఐసిడిఎస్ కార్యాలయంలో సమ్మె నోటీస్ అందజేత

**అల్వాల్, ఫిబ్రవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్లను తక్షణమే రద్దు చేయాలని, ఐసిడిఎస్‌కు సరైన బడ్జెట్ కేటాయించి అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది.ఈ మేరకు 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని తెలియజేస్తూ అల్వాల్ ప్రాజెక్ట్ ఐసిడిఎస్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు.ఈ సందర్భంగా యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ, 29 కార్మిక చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తూ 2025 నవంబర్ 21న జారీ చేసిన నోటిఫికేషన్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.విద్యుత్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని, పేదలకు ఉపాధి హామీ కల్పిస్తున్న ఎంజిఎన్ఆర్ఇజిఎ చట్టాన్ని కొనసాగించాలని కోరారు. అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్‌కు కనిష్ఠ వేతనం రూ.26,000 ఇవ్వాలని, పెన్షన్ రూ.10,000 అమలు చేయాలని, ఐసిడిఎస్‌ను రక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. అలాగే విద్యుత్ సవరణ బిల్లు, విత్తన సవరణ బిల్లు, ఎల్ఐసీలో విదేశీ పెట్టుబడులకు అనుమతి వంటి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ అన్ని డిమాండ్ల సాధన కోసం జాతీయ కార్మిక సంఘాల పిలుపు మేరకు ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు విజయవంతం చేయాలని బి.శోభారాణి పిలుపునిచ్చారు.



## బస్తీబాటలో కాలనీ సమస్యలపై కాంగ్రెస్ నాయకుల పర్యటన

- జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీలో డ్రైనేజీ, తాగునీరు, వీధిదీపాలపై పరిశీలన

**మల్లాపూర్, ఫిబ్రవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):**

ఉప్పల్ నియోజకవర్గం నాచారం సర్కిల్ శక్తిసాయి నగర్ డివిజన్ పరిధిలోని జెఎన్ఎన్‌యుఆర్ఎం కాలనీ (ఫేజ్-1, రాజీవ్ గృహ కల్ప)లో కాంగ్రెస్ నాయకులు నెమలి అనిల్ కుమార్ ఆధ్వర్యంలో బస్తీబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్య, తాగునీటి సరఫరా లోపాలు, వీధి దీపాల మరమ్మత్తుల సమస్యలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్న నెమలి అనిల్ కుమార్, సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు త్వరిత గతిన పరిష్కారం చూపేలా నిరంతరం ఫాలోఅప్ చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రధాన లక్ష్యం. కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, వీలైనంత త్వరగా పరిష్కరించే బాధ్యత నాది" అని తెలిపారు .ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఉండం శ్రీనివాస్, కొయలకొండ రాజేష్, శైలజ గౌడ్, దాసరి సాయి పాల్గొన్నారు. స్థానిక నివాసితులు లక్ష్మణ్, రాజు, శేఖర్, చాణక్య, కిషోర్, రవి, సోమరాజు, శ్యామ్, నాగరాజు శర్మ, శైలజ, భాగ్యరాజు, శామ్యూల్, శ్రీనివాస్, శ్రీశైలం, రాము తదితరులు హాజరయ్యారు.

## 12వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి నాగలక్ష్మి హోరెత్తిన ప్రచారం

**సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**





సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బరిలో ఉన్న సింగపావు నాగలక్ష్మి ఎన్నికల ప్రచారాన్ని జోరుగా కొనసాగిస్తున్నారు. ఇంటింటా తిరుగుతూ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకుంటూ ముందుకు సాగుతున్నారు. పేద-బడుగు వర్గాలకు అండగా నిలుస్తూ, ప్రజల సమస్యలకు వెంటనే స్పందించే తత్వంతో ప్రచారం నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యమై, వారి నమ్మకాన్ని బలంగా పొందుతూ నాగలక్ష్మి ప్రచారం కొనసాగుతోందని పేర్కొన్నారు.

వార్డులో తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలిస్తున్న నాగలక్ష్మి, గెలిచిన వెంటనే వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. అలాగే యువతకు ఉపాధి అవకాశాలు, మహిళల భద్రత, సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని ప్రజలకు భరోసా ఇస్తున్నారు. ప్రజల అవసరాలే తన రాజకీయ లక్ష్యమని, హామీలకే పరిమితం కాకుండా అమలే తన ధ్యేయమని నాగలక్ష్మి స్పష్టం చేశారు. ప్రజల విశ్వాసంతో పాటు పార్టీ శ్రేణుల సంపూర్ణ మద్దతుతో తన ప్రచారం మరింత ఉత్సాహంగా కొనసాగుతోందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

## విద్యా ప్రమాణాలు మరింత మెరుగ్గా ఉండాలి

**హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్**

**హనుమకొండ,ఫిబ్రవరి3(తెలంగాణ ముచ్చట్లు):**





పదో తరగతి విద్యార్థులు విద్యా ప్రగతిలో మరింత ముందుకు సాగాలంటే ఉన్నత ప్రమాణాలతో బోధన సాగాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పేర్కొన్నారు. మంగళవారం ధర్మసాగర్ మండలంలోని మల్లకపల్లి, నారాయణగిరి గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా మల్లకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల బోధన తీరును పరిశీలించారు. డిజిటల్ విధానంలో కొనసాగుతున్న తరగతిలో పాఠ్యాంశాల బోధనపై విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. పాఠశాల పరిసరాలు, పరిశుభ్రత, నిర్వహణ విధానాలను పరిశీలించి పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులకు నిర్వహిస్తున్న స్లిప్ పరీక్షల వివరాలపై ఆరా తీశారు. పాఠశాల రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, పరిసరాల్లో పరిశుభ్రత లోపించడం, విద్యా ప్రమాణాలు తక్కువగా ఉండటంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై సంబంధిత ప్రధానోపాధ్యాయురాలికి షోకాజ్ నోటీసు జారీ చేయాలని అక్కడే ఉన్న జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్.వి.గిరిరాజ్ గౌడ్‌ను ఆదేశించారు.అనంతరం ప్రాథమిక పాఠశాలకు చెందిన నాలుగు, ఐదు తరగతులు నిర్వహిస్తున్న తరగతి గదిని సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై పరిశీలన జరిపి వంటగదిని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా, ఎంతమంది విద్యార్థులకు భోజనం తయారు చేస్తున్నారనే వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.

తదుపరి ధర్మసాగర్ మండలంలోని నారాయణగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలు, బాలుర విభాగాలను సందర్శించి విద్యార్థులతో సంభాషించారు. బాలికల తరగతిలో సహజ వనరులు అనే పాఠ్యాంశ బోధన కొనసాగుతుండగా, విద్యార్థినులను ప్రశ్నించి పాఠ్యాంశంపై అవగాహనను పరీక్షించారు. అప్పటికప్పుడు సమాధానాలు రాయించాలని సూచించి, వాటిని పరిశీలించారు. అనంతరం బాలుర విభాగాన్ని సందర్శించి విద్యార్థుల విద్యా స్థాయిపై చర్చించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ బి. రాంధన్, ఉపాధ్యాయులతో పాఠ్యాంశాల బోధన, విద్యార్థుల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. ఉపాధ్యాయుల డైరీలను పరిశీలించి పదో తరగతి విద్యార్థులకు రివిజన్ ఏ విధంగా నిర్వహిస్తున్నారో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిసరాలు బాగుండటంతో పాటు, పదో తరగతి బాలికల విద్యా ప్రగతిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠ్యాంశాల పునశ్చరణను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక శిక్షణ అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిరిరాజ్ గౌడ్, మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ బి. రాంధన్, తహసిల్దార్ గుత్తికొండ సదానందం, ఎంపీడీవో కమటం అనిల్ కుమార్, మల్లకపల్లి, నారాయణగిరి గ్రామాల సర్పంచులు గిన్నారపు లత, పుట్ట రేణుక తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక

**ఎల్కతుర్తి, ఫిబ్రవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):**



తెలంగాణ రాష్ట్ర ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్ డీలర్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడంతో ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

మంగళవారం ఎల్కతుర్తి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సూకినే సంతాజితో పాటు తెలంగాణ రైతు రక్షణ సమితి (టీఆర్ఆర్ఎస్) ఉమ్మడి కరీంనగర్-హనుమకొండ జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్ రావు, జిల్లా ఉపాధ్యక్షుడు హింగే రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి కోదాటి మాధవరావు తదితర నాయకులు హనుమకొండలోని నాగూర్ల వెంకటేశ్వర్ల నివాసాన్ని సందర్శించారు.

ఈ సందర్భంగా నాగూర్ల వెంకటేశ్వర్లను శాలువాతో సన్మానించి పూల బొకే అందజేసి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు.

అనంతరం జిల్లా అధ్యక్షుడు హింగే భాస్కర్ మాట్లాడుతూ, రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందించడంలో ఫర్టిలైజర్ షాపుల వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. అలాంటి బాధ్యతాయుతమైన పదవికి నాగూర్ల వెంకటేశ్వర్లు ఎన్నిక కావడం రైతు సమాజానికి ఎంతో మేలు చేస్తుందని పేర్కొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా రైతుల సమస్యలను గుర్తించి పరిష్కార దిశగా ఆయన సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఫర్టిలైజర్ రంగంలో ఉన్న అనుభవం, సేవాభావం, నాయకత్వ లక్షణాలతో నాగూర్ల వెంకటేశ్వర్లు ఈ పదవికి పూర్తి న్యాయం చేస్తారని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి జిల్లా కమిటీ విశ్వాసం వ్యక్తం చేసింది.

ఈ సందర్భంగా మరోసారి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని టీఆర్ఆర్ఎస్ నాయకులు ఆకాంక్షించారు.

## తీర్థాల జాతరకు విస్తృతమైన ఏర్పాట్లు చేయాలి

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

- *ఫిబ్రవరి 14 నుంచి ఫిబ్రవరి 18 వరకు 5 రోజుల పాటు మహాశివరాత్రి తీర్థాల జాతర నిర్వహణ

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -03(తెలంగాణ ముచ్చట్లు)**



ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల సంగమేశ్వర స్వామి దేవాలయంలో మహా శివరాత్రి సందర్భంగా జాతర నిర్వహణకు విస్తృతంగా ఏర్పాటు చేయాలని, ప్రణాళిక ప్రకారం నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ లోని తన చాంబర్ లో మంగళవారం తీర్థాల మహాశివరాత్రి జాతర ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఫిబ్రవరి 14 నుంచి ఫిబ్రవరి 18 వరకు 5 రోజుల పాటు మహా శివరాత్రి జాతర వేడుకలను అత్యంత వైభవోపేతంగా తీర్థాలలో నిర్వహించేందుకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధ మయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మహాశివరాత్రి సందర్భంగా దాదాపు నాలుగు లక్షల మంది భక్తులు ఖమ్మం రూరల్ మండలంలోని తీర్థాల గ్రామంలో ఉన్న సంగమేశ్వర స్వామి దేవాలయానికి విచ్చేసి స్వామి వారిని దర్శించుకునే అవకాశం ఉందని, గతం కంటే భక్తులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు.

అవసరమైన మేర పారిశుధ్య కార్మికులను నియమించి ఆలయ ప్రాంగణం, జాతర పరిసరాలను నిరంతరాయంగా శుభ్రం చేస్తూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య కార్మికులకు డ్రెస్ కోడ్ ఉండాలని, మండల పంచాయతీ అధికారి పారిశుధ్య కార్యక్రమాలు పర్యవేక్షించాలని కలెక్టర్ అన్నారు. తగినంత బ్లీచింగ్ అందుబాటులో ఉంచాలన్నారు. జాతర సమయంలో, జాతర తర్వాత పారిశుధ్య చర్యలు చేపట్టాలని అన్నారు.

జాతర సందర్భంగా ఉన్న 30 టాయిలెట్స్ బ్లాకులను రన్నింగ్ వాటర్ తో సహా అందుబాటులో ఉంచాలని, నిర్వహణ సక్రమంగా ఉండేలా చూడాలన్నారు. భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలన్నారు. తీర్థాల దేవాలయం వద్ద ఎటువంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, 24 గంటల నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు.

భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్న దృష్ట్యా అవసరమైన మేర బస్సుల సంఖ్య పెంచాలని, రద్దీగా ఉండే రూట్లలో అదనంగా బస్సులు నడపాలన్నారు. దేవస్థానం వద్ద క్యూలైన్లు ఏర్పాటు చేయాలని, స్నాన ఘట్టాల వద్ద రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేయాలని, మిషన్ భగీరథ ద్వారా భక్తులకు త్రాగునీటి వసతి కల్పించాలని కలెక్టర్ సూచించారు.

జాతర సందర్భంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో 4 ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి వైద్య శిబిరంలో వైద్యాధికారులు పారామెడికల్ సిబ్బందినీ సరిపోను ఓఆర్ఎస్, అత్యవసర మందులతో అందుబాటులో ఉంచాలని కలెక్టర్ సూచించారు. రెండు 108 వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఫైర్ ఇంజన్ కావాల్సిన పరికరాలు, సిబ్బందితో జాతరలో అందుబాటులో ఉంచాలన్నారు.

పటిష్ట బందోబస్తు చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.

అన్ని శాఖల అధికారులు సిబ్బంది సహాయ సహకారంతో విధులు నిర్వహించాలని, భక్తులకు ఇబ్బందులు కలకుండా అవసరమైన మేర సైన్ బోర్డులు, ఎంట్రీ, ఎగ్జిట్ బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు.

అన్ని శాఖల అధికారులతో కంట్రోల్ రూం ఏర్పాటుచేయాలని, తప్పిపోయిన, భక్తులకు సూచనలకు మంచి పబ్లిక్ అడ్రస్ సిస్టం ఏర్పాటుచేయాలని అన్నారు. మహాశివరాత్రి జాతరను విజయవంతంగా నిర్వహించేందుకు ఆయా శాఖలకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని భక్తులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా జాతరలో వసతుల కల్పనకు కలెక్టరేట్ నుండి 10 లక్షల రూపాయల చెక్కును ఆలయ ఏవోకు కలెక్టర్ అందజేశారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. రామారావు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం రూరల్ మండల తహసీల్దార్ రాంప్రసాద్, తీర్థాల ఆలయ ఏవో కె. వేణుగోపాల్, విద్యుత్ డి ఇ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్: బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
బుధవారం- 4 - ఫిబ్రవరి 2026


# స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫైనల్ అభ్యర్థుల జాబితా విడుదల

- **అధికారికంగా ప్రకటించిన డాక్టర్ తాటికొండ రాజయ్య**

**స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**



స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, మొత్తం 18 వార్డులకు గాను తెలంగాణ రాష్ట్ర తొలి ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ తాటికొండ రాజయ్య బీఆర్ఎస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థులను అధికారికంగా ప్రకటించారు.

సామాజిక సమీకరణాలు, రిజర్వేషన్లు, అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే విధంగా అభ్యర్థుల జాబితాను రూపొందించినట్లు ఆయన తెలిపారు. మున్సిపాలిటీ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా పార్టీ అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజయ్య మాట్లాడుతూ,

“స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యంగా బీఆర్ఎస్ పార్టీ తరపున అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పిస్తూ అభ్యర్థులను ఎంపిక చేశాం. ప్రజల సమస్యలపై పోరాడగల, సేవా దృక్పథం ఉన్న నాయకులకే అవకాశం ఇచ్చాం. ప్రతి వార్డులో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందనే పూర్తి నమ్మకం నాకు ఉంది” అని తెలిపారు.

**బీఆర్ఎస్ పార్టీ – ఫైనల్ అభ్యర్థుల జాబితా:**

- **1వ వార్డు (ఎస్సీ జనరల్): తాటికొండ మధు (మాదిగ)**
- **2వ వార్డు (ఎస్సీ జనరల్): గుర్రం శంకర్ (మాదిగ)**
- **3వ వార్డు (ఎస్సీ మహిళ): గుర్రం రమాదేవి (మాదిగ)**
- **4వ వార్డు (జనరల్): బూర్ల రాజేశ్వర్ (ముదిరాజ్)**
- **5వ వార్డు (జనరల్ మహిళ): చల్లా రమ్య (రెడ్డి)**
- **6వ వార్డు (జనరల్): బాలగాని అనిల్ (గౌడ్)**
- **7వ వార్డు (బీసీ మహిళ): బూర్ల స్వప్న (ముదిరాజ్)**
- **8వ వార్డు (జనరల్): పొన్న రాజేష్ (రజక)**
- **9వ వార్డు (జనరల్): కనకం గణేష్ (మాదిగ)**
- **10వ వార్డు (జనరల్): తాటికొండ రమ (ఎస్సీ మాదిగ)**
- **11వ వార్డు (జనరల్): ఊరడి లక్ష్మి (ముదిరాజ్)**
- **12వ వార్డు (జనరల్ మహిళ): కూరపాటి కవిత (పద్మశాలి)**
- **13వ వార్డు (ఎస్సీ జనరల్): మారేపల్లి ప్రసాద్ బాబు (మాదిగ)**
- **14వ వార్డు (జనరల్ మహిళ): మారేడుపాక రమాదేవి (వడ్రంగి)**
- **15వ వార్డు (జనరల్ మహిళ): నీలం సుజాత (మేదరి)**
- **16వ వార్డు (ఎస్టీ జనరల్): సాంబరాజు అంగడి (ఎరకల)**
- **17వ వార్డు (జనరల్): కుంభం లావణ్య (ముదిరాజ్)**
- **18వ వార్డు (బీసీ జనరల్): మహ్మద్ జబ్బర్ (మైనారిటీ)**

ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొనగా, మున్సిపాలిటీ పరిధిలో అన్ని వార్డుల్లో పార్టీ విజయం సాధిస్తుందనే ధీమాను పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేశారు.

# అప్పుడు అరాచకం.. ఇప్పుడు ఆరాటం!

- **నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి.. ఇందిరమ్మ ఇళ్లు కట్టించి ఇచ్చే బాధ్యత నాదే**
- **గత పాలకుల నిర్లక్ష్యంపై మంత్రి పొంగులేటి నిప్పులు**
- **ఏదులాపురం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హామీల వర్షం**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 3(తెలంగాణ ముచ్చట్లు)**





"అధికారంలో ఉన్న పదేళ్లు నిరుపేదల ఇళ్ల స్థలాల గురించి పట్టించుకోకుండా అరాచకంగా వ్యవహరించిన వారు... నేడు ఎన్నికలు రాగానే ఓట్ల కోసం ఆరాటపడుతున్నారు" అని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బీఆర్ఎస్ పార్టీ పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 7, 8, 9, 12, 13 వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచార రోడ్ షోలో ఆయన పాల్గొని విపక్షాల తీరుపై నిప్పులు చెరిగారు. గత పాలకులు పేదల సొంతింటి కలను నిర్లక్ష్యం చేశారని, ఆనాడు అర్హులైన వారికి స్థలాలు ఇవ్వకుండా వంచించారని ఆయన మండిపడ్డారు.

**సొంతింటి కలను నెరవేరుస్తాం**

ఈ సందర్భంగా జరిగిన సభల్లో మంత్రి పొంగులేటి ప్రజలకు కీలక భరోసా ఇచ్చారు. ఇళ్ల స్థలాలు ఇచ్చే మంత్రిని కూడా నేనేనని, ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అర్హులైన ప్రతి నిరుపేదకు ఇళ్ల స్థలాలు ఇచ్చి, వాటిలో ఇందిరమ్మ ఇళ్లు కూడా కట్టించి ఇచ్చే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఏప్రిల్ నుంచి వరుస విడతల్లో ప్రతి పేదవాడికి పక్కా ఇల్లు నిర్మించి ఇచ్చే వరకు విశ్రమించనని హామీ ఇచ్చారు.

**సంక్షేమ పథకాలతో పేదల చెంతకు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇప్పటికే 200 యూనిట్ల ఉచిత విద్యుత్, సన్న బియ్యం వంటి పథకాలతో పేదలకు అండగా నిలుస్తోందని మంత్రి వివరించారు. ఏదులాపురం మున్సిపాలిటీని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని, వార్డుల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైన్ల పనులను వేసవి లోపే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. తనను అసెంబ్లీ ఎన్నికల్లో దీవించినట్టే, ఏదులాపురం మున్సిపాలిటీ బరిలో పోటీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిందిగా కోరారు.

# ఆశా వర్కర్ల దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

**కుషాయిగూడ, ఫిబ్రవరి 03 (తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత, గౌరవప్రదమైన వేతనాలు, సామాజిక భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ 2026 ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా కమిటీ పిలుపునిచ్చింది .ఈ సందర్భంగా కుషాయిగూడ పిహెచ్‌సి వద్ద నిర్వహించిన ఆశా యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి మాట్లాడుతూ, జాతీయ ఆరోగ్య మిషన్ కింద దేశవ్యాప్తంగా దాదాపు 10 లక్షల మంది ఆశా వర్కర్లు ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకలాగా సేవలందిస్తున్నారని తెలిపారు. పగలు-రాత్రి తేడా లేకుండా తల్లులు, శిశువుల ఆరోగ్య సంరక్షణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ గౌరవప్రదమైన వేతనాలు, ఉద్యోగ భద్రత లేకపోవడం తీవ్ర అన్యాయమని విమర్శించారు.20 సంవత్సరాలకు పైగా సేవలందిస్తున్న ఆశా వర్కర్లకు కేవలం రూ.3,000 పారితోషికమే ఇస్తున్నారని, నిత్యావసర ధరలు పెరుగుతున్న ఈ పరిస్థితుల్లో అతి తక్కువ వేతనాలతో జీవించడం అసాధ్యమైందన్నారు. 2025 మార్చిలో పార్లమెంట్‌లో ప్రోత్సాహకాలు పెంచినట్లు ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఉత్తర్వులు జారీ చేయకపోవడం కేంద్ర ప్రభుత్వ వైఖరిని వెల్లడిస్తోందని ఆరోపించారు.ఇటీవల నోటిఫై చేసిన నాలుగు లేబర్ కోడ్లు కార్మికుల హక్కులను కాలరాస్తూ కనీస వేతనాలను తగ్గించడం, పని గంటలను పెంచడం, యాజమాన్యాలకు కార్మికులను తొలగించే స్వేచ్ఛ ఇవ్వడం వంటి ప్రమాదకర నిబంధనలతో ఉన్నాయని తెలిపారు. ఈ చట్టాలు అమలులోకి వస్తే యూనియన్లు నిర్వీర్యమవుతాయని, సమ్మె హక్కు అసాధ్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో ప్రతి ఆశా వర్కర్ తప్పకుండా పాల్గొని సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు.ప్రధాన డిమాండ్లు:నాలుగు లేబర్ కోడ్ల రద్దు, ఆశా వర్కర్లను రెగ్యులర్ వర్కర్లుగా గుర్తింపు, నెలకు రూ.26,000 కనీస వేతనం, రూ.10,000 పెన్షన్, పీఎఫ్-ఈఎస్ఐ సదుపాయాలు, 8 గంటల పని వేళలు, వేతనంతో కూడిన సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

# ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం పెరిగేలా ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అమలు..

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -03(తెలంగాణ ముచ్చట్లు)**





పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు ఇంగ్లీష్ భాషా పరిజ్ఞానం మెరుగుపర్చి, రీడింగ్ స్కిల్స్ పెంపొందేలాగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. వైరా మండలం పాలడుగు గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహిస్తున్న ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం అమలును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను తిరుగుతూ విద్యా భోదనను పరిశీలించారు. మూడవ, నాలుగు తరగతి గదులలో విద్యార్థులను ప్రత్యేకంగా అందించిన రైమ్స్ ఎలావున్నాయి, అని అడిగారు. బోర్డు పై ఇంగ్లీషు అక్షరాలు, పదాలు, పద్యాలు వ్రాసి వాటియొక్క ఉచ్చారణ, అర్థం చేసుకుంటూ, తిరిగి చెప్పగలుగుతున్నారా, ధ్వనులను బట్టి ఇంగ్లీష్ పదాలను గుర్తిస్తున్నారా అని అడిగి విద్యార్థుల సామర్థ్యాన్ని కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పాఠశాల ఆవరణలోని కిచెన్ లో వండిన అన్నం, కూరలను కలెక్టర్ పరిశీలించారు. భోజనంలో నాణ్యతను తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థులకు పోషకాహారం అందేలా చూడాలని సూచించారు. పాఠశాల పిల్లలతో కలిసి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మధ్యాహ్న భోజనం చేశారు. భోజనం మంచిగా ఉంటుందా, కోడిగుడ్డు మెనూ ప్రకారం పెడ్డుతున్నారా, కూరలు రుచిగా ఉంటున్నాయా అని ఆరా తీశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి విద్యార్థికి చదివే సామర్థ్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేకంగా ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించామని అన్నారు. విద్యా ప్రమాణాల పెంపుదలతో విద్యార్థులకు మంచి భవిష్యత్తు లభిస్తుందన్నారు. విద్యార్థులకు ముందుగా చదవడం, చదివింది అర్థం చేసుకోవడం అనే నైపుణ్యాలు రావడం చాలా కీలకమని అన్నారు. ఒక విద్యార్థికి చదివే సామర్థ్యం అందిస్తే జీవితాంతం ఉపయోగపడుతుందని, విద్యార్థుల చదివే సామర్థ్యం పెంపు చేయడం కోసం చేపట్టిన ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ అమలుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధపెట్టి బోధన అందించాలని సూచించారు. ప్రతి రోజు విద్యార్థి గంట సేపు చదివే సామర్థ్యంపై అభ్యాసన చేసేలా సాంకేతిక పరిజ్ఞానంతో ఒక బుక్ లెట్ తయారు చేయడం జరిగిందని అన్నారు. బుక్లెట్ లో ఉన్న అంశాలను తూ.చ. తప్పకుండా ఉపాధ్యాయులు ఫాలో అవుతూ పిల్లలు చదివే సామర్థ్యం పెంపొందేలా కృషి చేయాలని అన్నారు. ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమ పర్యవేక్షణకు ఒక యాప్ తయారు చేశామని, దీనిని యూ.డి.ఐ.ఎస్. తో అనుసంధానం చేసినట్లు, ప్రతి బుధవారం విద్యార్థి రీడింగ్ స్కిల్స్ ఏ స్థాయిలో ఉన్నాయో అక్షరాలు, పదాలు, వ్యాఖ్యలు అప్ డేట్ మాత్రం చేయాలని అన్నారు. ఆంగ్ల అక్షరాలను ఫోనెటిక్ సౌండ్ తో సహా నేర్పేలా కోర్సు డిజైన్ చేశామని అన్నారు. ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ పెడితే ఎఫ్రీ చైల్డ్ రీడ్స్ కార్యక్రమం పరిపూర్ణంగా అమలు చేయవచ్చని, ప్రతి విద్యార్థి కనీసం ఒక పేరాగ్రాఫ్ చదివి అర్థం చేసుకునే స్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమం ప్రతి రోజు పాఠశాల సమయాల్లోనే ప్రాథమిక తరగతి విద్యార్థులకు అమలు చేయాలని అన్నారు.

పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా తల్లిదండ్రులతో సంప్రదింపులు జరిపి అవగాహన కల్పించాలన్నారు. మధ్యాహ్నం భోజనంలో సన్నబియ్యం వాడాలని, వంటకాల కోసం గ్యాస్ సిలిండర్ లను ఉపయోగించాలని, ప్రభుత్వ మెను ప్రకారం రోజువారి వంటకాలు ఉండే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం అంగన్వాడీ కేంద్రంను కలెక్టర్ సందర్శించారు. చిన్న పిల్లలకు అందించే కోడిగుడ్డు, పోషక ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైరా తహసీల్దార్ సురేష బాబు, మండల విద్యా అధికారి కె. వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు దయాకర్ రావు, రమేష్, శ్రీదేవి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన గణపారపు వీరయ్య

**ఖమ్మం బ్యూరో,ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు)**

27వ వార్డులో నివాసం ఉంటున్న సీపీఐ సీనియర్ నాయకుడు గణపారపు వీరయ్య ఇంటికి మంగళవారం ఉదయం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెళ్లారు. ఈ సందర్భంగా గణపారపు వీరయ్య, మధుతో పాటు మరో 20 మంది సీపీఐ నాయకులకు మంత్రి కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈ చేరికలకు మరింత ప్రాధాన్యత చేకూరింది.

## ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్న బిఆర్ఎస్ అభ్యర్థి ఎస్.ఏ. రాజు

**అమరచింత,ఫిబ్రవరి3(తెలంగాణ ముచ్చట్లు):**



అమరచింత మునిసిపాలిటీ ఎన్నికల్లో 9వ వార్డు నుంచి బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఎస్.ఏ. రాజు ఎన్నికల ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ప్రజలను కలిసి, కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.ఈ సందర్భంగా ఎస్.ఏ. రాజు మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పులు తీసుకొచ్చాయని అన్నారు. గతంలో చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు ఇంకా పరిష్కారం కాని సమస్యలను ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తానని తెలిపారు.తాను గెలిచినట్లయితే 9వ వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను వింటూ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫిబ్రవరి 12 సమ్మెకు ఆశాల మద్దతు

- **మెడికల్ ఆఫీసర్‌కు సమ్మె నోటీసు అందజేత**

**సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**



కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సమ్మెలో తాము సైతం పాల్గొంటున్నామని సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల ఆశా కార్యకర్తలు తెలిపారు. లేబర్ కోడ్లు రద్దు చేయకపోతే ఆశాలకు కనీస వేతనం దక్కే పరిస్థితి లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మెడికల్ ఆఫీసర్ ఇందు ప్రియాంకకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు మల్లూరు చంద్రశేఖర్‌తో పాటు ఆశా కార్యకర్తలు అరుణ, స్వాతి, పుల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ తీగలపై ఉన్న చెట్లను తొలగించిన విద్యుత్ శాఖ

**కాజీపేట్ ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు)**



ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా కాజీపేట్ లోని సెయింట్ థామస్ స్కూల్ సమీపంలో విద్యుత్ వైర్లపై ఉన్న చెట్లను మంగళవారం ఏ ఈ చందూలాల్ ఆధ్వర్యంలో విద్యుత్ శాఖ బృందం తొలగించారు. ఈ కార్యక్రమంలో ఫోర్ మెన్ మహమ్మద్ అలీ లైన్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, లైన్మెన్ రాము, శ్రీనివాస్ లతోపాటు సతీష్, వెంకటేశ్వర్లు రాజు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.



## అభ్యర్థుల చేతికి ‘బీ-ఫామ్’.. ప్రచారానికి ‘శ్రీకారం’!

- **ఏదులాపురం మున్సిపల్ పోరులో ‘హస్తం’ దూకుడు**
- **బీ-ఫామ్‌లు అందజేసి...అభ్యర్థులకు దిశానిర్దేశం చేసిన మంత్రి పొంగులేటి**

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు)**

ఏదులాపురం మున్సిపాలిటీ ఎన్నికల సమరంలో కాంగ్రెస్ పార్టీ కీలక ఘట్టాన్ని పూర్తి చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మంగళవారం అభ్యర్థుల చేతికి బీఫామ్ లు అందజేశారు. దీంతో మున్సిపల్ కోటపై ‘హస్తం’ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ప్రచార పర్వం ఊపందుకుంది.

గెలుపే లక్ష్యంగా గడప గడపకూ..

బీఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు వెంటనే ఎన్నికల అధికారులకు నామినేషన్లు సమర్పించాలని మంత్రి సూచించారు. "అధికారికంగా బీఫామ్‌లు అందాయి.. ప్రభుత్వ ప్రజారంజక పాలనను, అమలు చేస్తున్న గ్యారంటీలను వివరించి ఓటర్ల ఆశీస్సులు పొందాలని పిలుపునిచ్చారు.

**క్లీన్ స్వీపే టార్గెట్!**

వార్డుల వారీగా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ, ప్రత్యర్థుల వ్యూహాలను చిత్తు చేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ఏదులాపురంలోని అన్ని వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రి చేతుల మీదుగా బీఫామ్‌లు అందుకున్న అభ్యర్థులు రెట్టింపు ఉత్సాహంతో ప్రచార క్షేత్రంలోకి అడుగుపెట్టారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# నేడు ఏదులాపురంలో మంత్రి పొంగులేటి రోడ్ షో

◆ ఉదయం 8 గంటల నుంచి 10,11, 28,29, 30వ వార్డుల్లో పర్యటన

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు)



మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీలో రోడ్ షో నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి 10,11,28,29,30వ వార్డుల్లో ఆయన విస్తృతంగా పర్యటించనున్నారు. ఆయా వార్డుల ప్రధాన కూడళ్లలో జరిగే రోడ్ షోల ద్వారా అభ్యర్థుల విజయానికి మద్దతుగా ఆయన ప్రసంగించనున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్ చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అభ్యర్థులు, పార్టీ శ్రేణులు, వార్డు ఇన్ చార్జిలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజల కోసం పనిచేయాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి

◆ 9వ వార్డు బీఎస్పీ అభ్యర్థి ఇందు శ్రావణి

స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి03 (తెలంగాణ ముచ్చట్లు):



స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో బహుజన్ సమాజ్ పార్టీ అభ్యర్థిగా ఇందు శ్రావణి కౌన్సిలర్ ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు తెలిపారు. తొలుత మూడవ వార్డు నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఆమె, స్వచ్ఛందంగా నామినేషన్ ఉపసంహరించుకుని తొమ్మిదవ వార్డు జనరల్ స్థానంలో పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. తన సొంత గ్రామం చాగల్ అయినప్పటికీ, తొమ్మిదవ వార్డులో ప్రజాసేవ చేయాలనే సంకల్పంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఇందు శ్రావణి తెలిపారు. రాజకీయం అనేది వ్యక్తిగత ప్రయోజనం కోసం కాదు, సామాజిక బాధ్యతగా భావించి ప్రజల కోసం పనిచేయాలనే ఆలోచనతో రాజకీయాల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. ఉన్నత చదువులు చదివిన విద్యావంతురాలిగా, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్నానని అన్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో సామాజిక న్యాయం సాధించగల పార్టీ బహుజన్ సమాజ్ పార్టీ మాత్రమేనని నమ్మకంతో బీఎస్పీ నుంచి బిఫారం పొంది ఎన్నికల బరిలో నిలిచినట్లు వివరించారు. తొమ్మిదవ వార్డులోని మౌలిక సమస్యలను గుర్తించి, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. చదువుకున్న మహిళా ప్రతినిధిగా తనకు అవకాశం ఇస్తే, తొమ్మిదవ వార్డు అభివృద్ధికి నిజాయితీగా పనిచేస్తానని ఇందు శ్రావణి తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచి, ఏనుగు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆమె ప్రజలను కోరారు.



# పదోన్నతిపై బదిలీ అయిన ఓం ప్రకాష్‌కు ఘన వీడ్కోలు

పెద్దమందడి,ఫిబ్రవరి3(తెలంగాణ ముచ్చట్లు):

పెద్దమందడి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్వైజర్‌గా విధులు నిర్వహిస్తున్న ఓం ప్రకాష్ సబ్ యూనిట్ ఆఫీసర్‌గా పదోన్నతి పొందుతూ ఆత్మకూరు బదిలీపై వెళ్తున్న సందర్భంగా వైద్య సిబ్బంది ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా ఓం ప్రకాష్‌ను శాలువలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజుల మాట్లాడుతూ, ఓం ప్రకాష్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏడేళ్లకు పైగా హెల్త్ సూపర్వైజర్‌గా సేవలందించారని తెలిపారు.విధి నిర్వహణలో ఆయన అందించిన సేవలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని ప్రశంసించారు.ఈ వీడ్కోలు సమావేశంలో డాక్టర్ యశస్విని, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



# రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

కాజీపేట్ ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు)



హనుమకొండ మండలం మడికొండ పోలీస్ స్టేషన్లో మంగళవారం రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ను నిర్వహించారు. రౌడీ షీటర్లు ఏ విధమైన గొడవల్లో జోక్యం చేసుకోరాదని, సత్ప్రవర్తన తో జీవనాన్ని కొనసాగించాలని పోలీసులు వారిని హెచ్చరించారు.

# డైరీ రైతుల సమస్యలను లోక్‌సభలో లేవనెత్తిన వరంగల్ ఎంపీ కడియం కావ్య

వరంగల్,ఫిబ్రవరి03(తెలంగాణ ముచ్చట్లు):



వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గానికి చెందిన డైరీ రైతులు, పశుపోషకులు ఎదుర్కొంటున్న సమస్యలను లోక్‌సభలో వరంగల్ ఎంపీ కడియం కావ్య ప్రస్తావించారు. వరంగల్ జిల్లాలో పశువులకు మేత లభ్యత, వెటర్నరీ సేవల అందుబాటు, పశువుల వ్యాధుల నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక అధ్యయనం చేపట్టిందా అనే అంశాన్ని ఆమె సభ దృష్టికి తీసుకువచ్చారు. మొబైల్ వెటర్నరీ యూనిట్లు, నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్, రాష్ట్రీయ గోకుల్ మిషన్, జంతు ఆరోగ్య కార్యక్రమాల కింద వరంగల్ జిల్లాకు అందించిన సహాయంపై వివరాలు ఇవ్వాలని పశుసంవర్ధక, మత్స్య, డైరీ శాఖ మంత్రిని ఎంపీ ప్రశ్నించారు. గత మూడేళ్లలో ఎన్ని గ్రామాలు కవర్ అయ్యాయి, ఎన్ని పశువులకు టీకాలు వేశారు, నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ కింద చేపట్టిన కార్యక్రమాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

అలాగే డైరీ రైతులకు సమయానికి, న్యాయమైన ధరకు పాల సేకరణ జరిగేలా తీసుకున్న చర్యలు, చిల్లింగ్ సెంటర్లు, ప్రాసెసింగ్ మౌలిక వసతుల బలోపేతం, వ్యాధుల కారణంగా రైతులకు కలిగే నష్టాలను తగ్గించేందుకు చేపట్టిన చర్యలపై కూడా వివరాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

దీనికి కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ లిఖితపూర్వక సమాధానంలో, రాష్ట్ర ప్రభుత్వాల కార్యాచరణ ప్రణాళికల ఆధారంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. అయితే వరంగల్ జిల్లాకు ప్రత్యేకంగా ఎలాంటి అధ్యయనం నిర్వహించినట్లు పేర్కొనలేదని వెల్లడించారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద వరంగల్ జిల్లాలో 92,104 పశువులకు ఇన్సెమినేషన్, మొత్తం 1.23 లక్షల కృత్రిమ గర్భధారణలు జరిగాయని, 57,103 మంది రైతులు లబ్ధిపొందినట్లు మంత్రి తెలిపారు. సెక్స్ సార్టెడ్ సీమన్, ఐవీఎఫ్ సాంకేతికత, మైత్రీ టెక్నీషియన్లు, ప్రోజెనీ టెస్టింగ్, సీమన్ స్టేషన్ల బలోపేతం వంటి కార్యక్రమాల వివరాలను ఆయన వెల్లడించారు.

గత ఐదేళ్లలో తెలంగాణకు రాష్ట్రీయ గోకుల్ మిషన్ కింద రూ.57.95 కోట్లు, నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డైరీ డెవలప్‌మెంట్ కింద రూ.95.84 కోట్లు, లైవ్‌స్టాక్ హెల్త్ అండ్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ కింద రూ.61.19 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అయితే తెలంగాణకు మంజూరైన 100 మొబైల్ వెటర్నరీ యూనిట్లకు సంబంధించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం తిరిగి పంపిన కారణంగా ప్రస్తుతం కేంద్ర పథకం కింద ఒక్క మొబైల్ వెటర్నరీ యూనిట్ కూడా పనిచేయడం లేదని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సమాధానాలపై వరంగల్ ఎంపీ కడియం కావ్య స్పందిస్తూ, వరంగల్ జిల్లాకు ప్రత్యేక అవసరాలపై అధ్యయనం లేకపోవడం, మొబైల్ వెటర్నరీ యూనిట్లు పనిచేయకపోవడం వల్ల రైతులకు సకాలంలో వైద్య సేవలు, మేత సహాయం అందకపోయే పరిస్థితి ఏర్పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. డైరీ రంగాన్ని బలోపేతం చేసి రైతులకు పూర్తి స్థాయిలో మద్దతు అందించేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

# ఫర్టిలైజర్ యాప్ ద్వారా యూరియా పంపిణీ

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి- 03(తెలంగాణ ముచ్చట్లు)



ఖమ్మం జిల్లాలో యూరియా పంపిణీ ఫర్టిలైజర్ యాప్ ద్వారా విజయవంతంగా జరుగుతుందని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో జనవరి, 29వ తేదీ నుండి యూరియా పంపిణి యాప్ ద్వారా జరుగుతుందని, ఈ వారం రోజుల్లో 25252 మంది రైతులు 108721 యూరియా సంచులను యాప్ ద్వారా బుక్ చేసుకున్నారని, 87350 సంచులను కొనుగోలు చేయడం జరిగిందని కలెక్టర్ అన్నారు.

రైతులు ఈ యాప్ ద్వారా జిల్లాలో అందుబాటులో ఉన్న యూరియాను వారి యొక్క పంట రకమును బట్టి, వారికున్న విస్తీర్ణాన్ని బట్టి జిల్లాలో ఏ డీలర్ వద్ద అయినా, ఏ సొసైటీలో అయినా అందుబాటులో ఉన్న యూరియాను బుక్ చేసుకోవచ్చని తెలిపారు. ఒకసారి బుక్ చేసుకున్న తర్వాత 24 గంటల లోపు ఆ రైతు బుక్ చేసుకున్న డీలర్ దగ్గరికి వెళ్లి కొనుగోలు చేయవచ్చని అన్నారు. ఏదైనా పరిస్థితులలో 24 గంటల లోపు యూరియాను తీసుకోనట్లయితే ఆ యొక్క బుకింగ్ రద్దు అవుతుందని, మళ్లీ రైతులు బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అన్నారు. ఇందులో పట్టాదారులు, పట్టా పుస్తకాలు లేని వారు, కౌలు రైతులు యూరియాను బుక్ చేసుకునే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. కౌలుదారులు అయితే వాళ్ళు ఎవరి దగ్గర అయితే కౌలుకు తీసుకున్నారో వారి యొక్క పట్టాదారు పాస్ బుక్ నెంబరు ద్వారా బుక్ చేసుకోవచ్చని, అయితే ఆ పట్టాదారు ఓటీపీ చెప్పాల్సి ఉంటుందని అన్నారు.

ఈ యాప్ ను రైతులకు అలవాటు చేయటానికి, అవగాహన కల్పించడానికి ప్రతి ఔట్లెట్ దగ్గర వ్యవసాయ శాఖ ద్వారా ఒక వ్యక్తిని నియమించడం జరుగుతుందని లేదా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి రైతులకు సహాయం చేయడం జరుగుతుందని అన్నారు. రైతులందరూ ఈ యాప్ ను వినియోగించుకొని యూరియాను కొనుగోలు చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. డీలర్లు, సహకార సంఘాల వారు యాప్ లో మాత్రమే యూరియా అమ్మకాలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. రైతులు తమ యొక్క ఆండ్రాయిడ్ ఫోన్లో యాప్ ను ప్లే స్టోర్లో సులభంగా డౌన్లోడ్ చేసుకోవచ్చని, తద్వారా రైతులు ఏ విధమైన ఆందోళన, శ్రమ లేకుండా తమ విలువైన సమయాన్ని ఆదా చేసుకొని యూరియా కొనుగోలు చేయడం జరిగిందని అన్నారు. యాప్ అందుబాటులోకి రావడం ద్వారా జిల్లాలో ఏ ప్రాంతంలో ఎంత యూరియా అందుబాటులో ఉందనే సమాచారం రైతులందరికీ తెలియటం వల్ల రైతులు తమ ఇంటి వద్ద నుండే యూరియా ను బుక్ చేసుకొని 24 గంటల్లో కొనుగోలు చేస్తున్నారన్నారు. యాప్ తో క్యూ లైన్ లలో నిలబడే అవసరం లేదని, సమయం ఆదా అవుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# నిబంధనల మేరకు ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించాలి

◆ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి -03(తెలంగాణ ముచ్చట్లు)





ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని, నిబంధనల ప్రకారం ఎన్నికల విధులు కట్టుదిట్టంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం వైరా తహసీల్దారు కార్యాలయం నందు ఏర్పాటు చేసిన వైరా మున్సిపాలిటీ వార్డు అభ్యర్థుల బీఫామ్ పరిశీలన, స్వతంత్ర అభ్యర్థుల ఎన్నికల గుర్తుల కేటాయింపు ప్రక్రియను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. అభ్యర్థులు సమర్పించిన నామినేషన్ ప్రతాలు, బీఫామ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, శాంతియుత వాతావరణంలో ఎన్నికల నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.


ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ

ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి మున్సిపల్ ఎన్నికల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పగడ్బందీగా ఎన్నికలు నిర్వహించుటకు నోడల్ అధికారులు, స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు సమన్వయంతో పని చేయాలన్నారు. ఎన్నికల అధికారులు క్షేత్ర స్థాయిలో కలిసి పని చేసి మన జిల్లాలో ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా జరిగే విధంగా అందరు కలిసి పనిచేయాలని సూచించారు. ఎన్నికలకు కేటాయించిన అధికారులందరు నిబంధనలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో నామినేషన్ల తర్వాత ఉపసంహరణ, రాజకీయ పార్టీ ల బీఫామ్ పరిశీలన చాలా ముఖ్యమైన అంశమని వివరించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రతి అంశం నిబంధనల ప్రకారం జరిగేలా చూడాలని, నామినేషన్ల అప్పీళ్ళ పరిష్కారం, బీఫామ్ లేని అభ్యర్డులు స్వతంత్ర అభ్యర్థులుగా ప్రకటన, గుర్తుల కేటాయింపు పారదర్శకంగా కేటాయించాలని సూచించారు. ఏలాంటి తొందరపాటు లేకుండా సమన్వయం చేసుకోవాలని తెలిపారు.

ఎన్నికల ప్రచార నిమిత్తం ర్యాలీ, సమావేశాల నిర్వహణకు ముందస్తు అనుమతి తీసుకోవాలని, సౌండ్ సెట్, వాహనానికి ప్రత్యేకంగా అనుమతి తీసుకోవాలని, ఎక్కడ కూడా పోటీదారులకు ఒకే రూట్ లో సమావేశాలు, ర్యాలీల నిర్వహణకు అనుమతి జారీ చేయవద్దని అన్నారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురి చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలిస్తే పట్టుకుని సీజ్ చేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వైరా తహసీల్దారు సురేష్ బాబు, మున్సిపల్ కమీషనర్ గురులింగం, ఎంపీడీవో తేజావత్ సక్రియ, ఎంఈఓ వెంకటేశ్వర్లు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కా-226టీ ఒప్పందం విఫలం.. ప్రత్యామ్నాయంగా ఏడబ్ల్యూ109 ట్రెక్కర్‌ఎం

◆ 3 టన్నుల శ్రేణిలో ద్విఇంజిన్ హెలికాప్టర్ ఆఫర్
◆ రష్యా నుంచి కొత్త ఇంజిన్ ప్రతిపాదన
◆ భారత హెలికాప్టర్ అవసరాలపై కీలక పరిణామాలు



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:** రష్యాతో కుదరాల్సిన కామ్‌వ్ కా-226టీ ఒప్పందం విఫలమైన నేపథ్యంలో, భారత అవసరాలకు ప్రత్యామ్నాయంగా ఏడబ్ల్యూ109 ట్రెక్కర్‌ఎం హెలికాప్టర్‌ను ఆఫర్ చేయనున్నారు. 3 టన్నుల శ్రేణిలోకి వచ్చే ఈ హెలికాప్టర్, లైట్ యుటిలిటీ హెలికాప్టర్ తరహా వర్గానికి చెందినదిగా నిపుణులు చెబుతున్నారు. అయితే ద్విఇంజిన్ వ్యవస్థతో ఉండటం దీని ప్రధాన ప్రత్యేకతగా పేర్కొంటున్నారు.

ఏడబ్ల్యూ109 ట్రెక్కర్‌ఎం హెలికాప్టర్‌లో రెండు ప్రాట్ అండ్ విట్నీ కెనడా సంస్థకు చెందిన పీడబ్ల్యూ207సీ ఇంజిన్లు అమర్చారు. ద్విఇంజిన్ అమరిక వల్ల భద్రత, విశ్వసనీయత పెరగడంతో పాటు, ఎత్తైన ప్రాంతాల్లోనూ మెరుగైన పనితీరు సాధ్యమవుతుందని రక్షణ రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇది సైనిక, పౌర అవసరాలకు అనుకూలంగా మారే అవకాశాలు ఉన్నాయని విశ్లేషిస్తున్నారు.

ఇదిలా ఉండగా, కా-226టీ ఒప్పందం కుదరకపోవడంతో రష్యా కూడా కొత్త ప్రతిపాదనతో ముందుకొచ్చింది. ఫ్రాన్స్‌కు చెందిన సాఫ్రాన్ సంస్థ తయారు చేసిన అరియస్ 2జీ1 టర్బైన్‌లకు బదులుగా, రష్యాలోనే అభివృద్ధి చేసిన ఓడీకే-క్లిమోవ్ వీకే-650వి ఇంజిన్‌ను అందించేందుకు సిద్ధమని ప్రకటించింది. ఈ ఇంజిన్ పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో రూపొందించబడిందని రష్యా వర్గాలు చెబుతున్నాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో భారత హెలికాప్టర్ కొనుగోళ్లలో కీలక మార్పులు చోటుచేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవైపు ద్విఇంజిన్ ఏడబ్ల్యూ109 ట్రెక్కర్‌ఎం ఆఫర్, మరోవైపు రష్యా ప్రతిపాదించిన కొత్త ఇంజిన్ పరిష్కారం మధ్య ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది రక్షణ రంగంలో ఆసక్తిగా మారింది.

## డీఆర్‌డీఓ ఘన విజయం.. ఎస్‌ఎఫ్‌డీఆర్ సాంకేతికత సఫలం

- దీర్ఘ శ్రేణి క్షిపణుల అభివృద్ధికి కీలక ముందడుగు
- ఎలైట్ దేశాల జాబితాలో భారత్ స్థానం
- ఒడిశా తీరంలో విజయవంతమైన పరీక్ష



**చాందీపూర్, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**
భారత రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ డీఆర్‌డీఓ ఘన విజయం సాధించింది. ఒడిశా తీరంలోని చాందీపూర్ వద్ద ఉన్న సమగ్ర పరీక్షా కేంద్రం నుంచి ఘన ఇంధన డక్టెడ్ రామ్‌జెట్ సాంకేతికతను విజయవంతంగా ప్రదర్శించింది. ఫిబ్రవరి 3న ఉదయం 10 గంటల 45 నిమిషాల సమయంలో ఈ కీలక పరీక్షను నిర్వహించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ సాంకేతికత ద్వారా దీర్ఘ శ్రేణి గాలిలో నుంచి గాలికి ప్రయోగించే క్షిపణులను అభివృద్ధి చేయడం సాధ్యమవుతుంది. ఇది శత్రువులపై వ్యూహాత్మక ఆధిక్యతను కల్పించడంలో కీలక పాత్ర పోషించనుంది. ఆధునిక యుద్ధ అవసరాలకు అనుగుణంగా భారత రక్షణ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే దిశగా ఇది ముఖ్యమైన అడుగుగా భావిస్తున్నారు. ఎస్‌ఎఫ్‌డీఆర్ సాంకేతికతను విజయవంతంగా పరీక్షించడంతో ఈ సామర్థ్యం కలిగిన ప్రపంచంలోని కొద్ది దేశాల ఎలైట్ జాబితాలో భారత్ స్థానం సంపాదించింది. ఈ సాంకేతికత క్షిపణుల వేగం, పరిధి, లక్ష్య సాధన సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ విజయంతో దేశీయంగా ఆధునిక క్షిపణుల రూపకల్పన, తయారీ రంగంలో స్వయం సమృద్ధి దిశగా భారత్ మరింత ముందుకు సాగుతున్నట్లు స్పష్టమైంది. భవిష్యత్‌లో భారత సైనిక శక్తిని కొత్త స్థాయికి తీసుకెళ్లే సామర్థ్యం ఈ సాంకేతికతకు ఉందని రక్షణ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

## వాడు నడుము గిల్లితే ఊరుకోలేదు.. ఒక్కటిచ్చా..

నటి దివి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తనకు ఎదురైన చేదు అనుభవాన్ని బహిరంగంగా పంచుకున్నారు. పబ్‌లో జరిగిన ఓ ఈవెంట్‌కు అతిథిగా హాజరైన సమయంలో తన అనుమతి లేకుండా ఓ వ్యక్తి నడుము గిల్లాడని ఆమె తెలిపారు. చుట్టూ బాడీగార్డులు ఉన్నప్పటికీ ఈ ఘటన జరగడం షాక్‌కు గురిచేసిందని చెప్పారు. అయితే ఆ సమయంలో తాను ఏమాత్రం భయపడలేదని, వెంటనే ఆ వ్యక్తిని బాడకోవ్ అని తిట్టి ఒక్కటిచ్చి అక్కడి నుంచి వెళ్లిపోయానని స్పష్టం చేశారు. అలా స్పందించినందుకు తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని, ఊరుకుని ఉంటేనే తనకు బాధగా ఉండేదని దివి అన్నారు.
ఈ ఘటన తన దుస్తుల వల్ల కాదని ఆమె స్పష్టంగా చెప్పారు. ఆ రోజు తాను సాదాసీదా టీషర్ట్‌లోనే ఉన్నానని, మహిళ ఏం వేసుకున్నా అంగీకారం లేకుండా తాకే హక్కు ఎవరికీ లేదని కుండబద్దలు కొట్టారు. దుస్తుల ఎంపిక అనేది పూర్తిగా వ్యక్తిగత విషయం అని, ముందుగా మనకు సౌకర్యంగా ఉండేదే ధరించాలన్నారు. మనకు అసౌకర్యంగా అనిపించే దుస్తులు వేసుకోవాల్సిన అవసరం లేదని, అలాగే ఇతరులు ఏం ధరించారన్నది చూసి అసహనం వ్యక్తం చేయడం తప్పని దివి అభిప్రాయపడ్డారు. ఇతరుల దుస్తులు చూసి కొందరు ట్రిగ్గర్ అవుతారన్న మాటలను ఆమె తీవ్రంగా ఖండించారు. అలా అనిపిస్తే చూడకుండా ఉండాలని, అది మన సమస్య తప్ప ఎదుటివారి తప్పు కాదని చెప్పారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు సరైన అవగాహన, విలువలు నేర్పించాలని, బయటి ప్రపంచం గురించి దాచకుండా నిజాలు తెలియజేయాలని దివి సూచించారు. మహిళల పట్ల గౌరవం, వ్యక్తిగత గోప్యతను సమాజం గౌరవించాల్సిన అవసరం ఉందని ఆమె వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# ప్రచార హోరు.. కాంగ్రెస్ జోరు!

- ఏదులాపురంలో 'హస్తం' దూకుడు..
  ఇంటింటికీ పొంగులేటి ప్రసాద్‌రెడ్డి

**ఖమ్మం బ్యూరో, ఫిబ్రవరి 3(తెలంగాణ ముచ్చట్లు)**
మున్సిపల్ ఎన్నికల ప్రచార పర్వంలో కాంగ్రెస్ పార్టీ అగ్రశ్రేణి శ్రేణులు సుడిగాలి పర్యటనలతో దూసుకుపోతున్నాయి. మంగళవారం సాయంత్రం 18, 19 వార్డుల్లో నిర్వహించిన ప్రచార కార్యక్రమం రాజకీయ వేడిని రాజేసింది.





### రోడ్ షోకు అపూర్వ స్పందన

ముఖ్య నేత పొంగులేటి ప్రసాద్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ శ్రేణులు నిర్వహించిన రోడ్‌షోకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. 18వ వార్డు అభ్యర్థిని పందూరి అరుణ, 19వ వార్డు అభ్యర్థిని మాలాది శిరీష గెలుపును ఆకాంక్షిస్తూ బారుగూడెం, గొల్లగూడెం ప్రాంతాల్లో ప్రసాద్‌రెడ్డి విస్తృతంగా పర్యటించారు.

### సంక్షేమ పథకాలే విజయ సూత్రం

గడప గడపకూ వెళ్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన రెండేళ్లలోనే పేదలకు అండగా నిలిచే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, అదే స్ఫూర్తితో మున్సిపాలిటీని తీర్చిదిద్దుతామని భరోసా ఇచ్చారు.

### పట్టణ ప్రగతి కాంగ్రెస్‌తోనే సాధ్యం

అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తేనే పట్టణ ప్రగతి మరింత వేగవంతం అవుతుందని ఆయన స్పష్టం చేశారు. ఫిబ్రవరి 11న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి అభ్యర్థులను భారీ మెజారిటీతో విజయతీరాలకు చేర్చాలని పిలుపునిచ్చారు.

### విజయీభవ.. కార్యకర్తల ధీమా

ప్రచారంలో భాగంగా యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అభ్యర్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ ప్రచార జోరు చూస్తుంటే ఏదులాపురంలో హస్తం జెండా ఎగరడం ఖాయమని పార్టీ కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు.





## సత్తుపల్లిలో మున్సిపాలిటీలో కాంగ్రెస్ జెండా ఎగరవేయాలి

- 23 వార్డుల్లో కాంగ్రెస్ విజయమే లక్ష్యం
- ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్

**సత్తుపల్లి, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**
ఖమ్మం జిల్లా, సత్తుపల్లి మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించి మున్సిపాలిటీని కైవసం చేసుకుంటుందని, సత్తుపల్లి నియోజకవర్గం శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ధీమా వ్యక్తం చేశారు. సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 23 వార్డులకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను ప్రకటించి, వారికి బీ-ఫారమ్‌లు అందజేశారు. ఈ సందర్భంగా బీ-ఫారమ్‌లు పొందిన అభ్యర్థుల వివరాలను వెల్లడించారు. 1వ వార్డు - మట్టా ప్రసాద్, 2వ వార్డు - నాయుడు రాధిక, 3వ వార్డు - బొంతు సుమలత, 4వ వార్డు - షేక్ మౌలాలి, 5వ వార్డు - షేక్ అకీమ్ పాషా, 6వ వార్డు - తోట సుజల రాణి, 7వ వార్డు - మహమ్మద్ నసీమా, 8వ వార్డు - బండారు శరత్ చంద్ర, 9వ వార్డు - జగన్నాదం శ్రీను, 10వ వార్డు - మట్టా దేవజ్యోతి, 11వ వార్డు - ఎస్కే నాగుల్ మీరా, 12వ వార్డు - సింగపావు నాగలక్ష్మి, 13వ వార్డు - ఉప్పు నాగమణి, 14వ వార్డు - పింగళి శామ్యూల్, 15వ వార్డు - దూదిపాళ్ల రాంబాబు,
16వ వార్డు - జొన్నలగడ్డ శ్రీనివాసరావు, 17వ వార్డు - చావా స్వరూపా రాణి, 18వ వార్డు - పర్సా మానస, 19వ వార్డు - కర్నాటి విజయకుమారి, 20వ వార్డు - మహమ్మద్ కమల్ పాషా, 21వ వార్డు - మందపాటి ప్రభాకర్ రెడ్డి, 22వ వార్డు - మహమ్మద్ రహానా బేగం, 23వ వార్డు - విరివాడ అపర్ణ. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ప్రజల నుంచి విస్తృత మద్దతు లభిస్తున్నదని అన్నారు. ప్రజల ఆశీస్సులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల దీవెనలతో, సత్తుపల్లి మున్సిపాలిటీలోని 23 వార్డులలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు భారీ మెజారిటీతో గెలిచి, మున్సిపాలిటీని కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకోనుందని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు.

## ఎస్ 400, సు 57పై అనుమానాలకు మాస్కో క్లారిటీ

- చైనా మైక్రోచిప్‌లపై ఆధారపడటం లేదన్న రష్యా
- భారత్ రక్షణ ప్రయోజనాలకు భద్రతా భరోసా

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**
భారత్ వినియోగిస్తున్న అత్యాధునిక రక్షణ వ్యవస్థలు ఎస్-400, సు-57 యుద్ధ విమానాల భవిష్యత్ భద్రతపై నెలకొన్న అనుమానాలకు రష్యా స్పష్టత ఇచ్చింది. ఈ వ్యవస్థల్లో ఉపయోగించే మైక్రోవేవ్ మైక్రోచిప్‌లు, ఎమ్ఎమ్ఐసీలు చైనా ఆధారంగా ఉంటాయన్న ప్రచారాన్ని మాస్కో ఖండించింది. చైనా భాగస్వామ్యం వల్ల భద్రతా లోపాలు తలెత్తుతాయన్న ఆరోపణలు నిరాధారమని రష్యా వర్గాలు వెల్లడించాయి.
చైనా తయారీ చిప్‌లు వాడితే సైబర్ గూఢచర్యానికి అవకాశం, సరఫరా గొలుసులో ఆలస్యం, నాణ్యత సమస్యలు, భౌగోళిక రాజకీయ ఒత్తిళ్లు వంటి ప్రమాదాలు ఉంటాయన్న వాదనలు వినిపించాయి. ఇవి భారత్‌కు వ్యూహాత్మక స్వాతంత్ర్యంపై ప్రభావం చూపుతాయన్న ఆందోళన కూడా వ్యక్తమైంది. అయితే ఈ అంశాలన్నింటికీ రష్యా సమాధానం ఇచ్చింది. రష్యా ప్రకటన ప్రకారం, సు-57తో పాటు ఎస్-500 వంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలకు అవసరమైన మైక్రోవేవ్ మైక్రోచిప్‌లను పూర్తిగా దేశీయంగానే తయారు చేయనున్నట్లు తెలిపింది. ఈ ఉత్పత్తి ప్రక్రియ 2027 చివరినాటికి పూర్తిస్థాయిలో అమలులోకి రానుందని పేర్కొంది. తద్వారా విదేశీ ఆధారపడటం పూర్తిగా తొలగిపోతుందని స్పష్టం చేసింది.
ఈ పరిణామంతో భారత్-రష్యా రక్షణ భాగస్వామ్యంపై నమ్మకం మరింత బలపడనుందని నిపుణులు భావిస్తున్నారు. చైనా ప్రభావం లేకుండా, స్వచ్ఛమైన సరఫరా గొలుసుతో రక్షణ వ్యవస్థలు అందుతాయన్న హామీ భారత భద్రతా వర్గాలకు ఊరటనిస్తోంది.



## రక్షణ కొనుగోలు విధానంలో మార్పులు.. త్వరలో కొత్త డీఏపీ అమలు

- కొనుగోలు ప్రక్రియకు వేగం
- సాంకేతిక మార్పులకు అనుగుణంగా సవరణలు
- ప్రజా సంప్రదింపులకు ముసాయిదా విడుదల


**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3 (తెలంగాణ ముచ్చట్లు):**
దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా కొనుగోలు ప్రక్రియను మరింత సమర్థవంతంగా మార్చే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం అమలులో ఉన్న రక్షణ కొనుగోలు విధానంలోని లోపాలను సరిదిద్దుతూ, సవరించిన రక్షణ కొనుగోలు విధానాన్ని త్వరలో అమల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. ఈ మార్పుల ద్వారా రక్షణ సామగ్రి కొనుగోళ్లలో జాప్యం తగ్గించి, వేగంగా మారుతున్న సాంకేతిక పరిణామాలకు తగినట్లు నిర్ణయాలు తీసుకునేలా వ్యవస్థను తీర్చిదిద్దనున్నారు.
సవరించిన విధానంలో ప్రధానంగా కొనుగోలు ప్రక్రియకు పడుతున్న కాలాన్ని గణనీయంగా తగ్గించడంపై దృష్టి సారించారు. కొనుగోలు పూర్తయ్యేలోపే సాంకేతికంగా పాతబడిపోతున్న పరిస్థితిని నివారించేందుకు, సమయపాలనకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న నేపథ్యంలో, రక్షణ రంగంలో తాజా పరిష్కారాలు సకాలంలో అందుబాటులోకి రావాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు.



ఈ సవరించిన రక్షణ కొనుగోలు విధానంపై సమీక్ష ప్రక్రియ తుది దశకు చేరుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే వారం రోజుల్లో ఈ ముసాయిదాను ప్రజా సంప్రదింపుల కోసం విడుదల చేయనున్నారు. పరిశ్రమలు, నిపుణులు, సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించిన అనంతరం తుది రూపం ఇవ్వనున్నారు.
ప్రజా సంప్రదింపుల ప్రక్రియ పూర్తయ్యాక, 2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి ముందే సవరించిన రక్షణ కొనుగోలు విధానాన్ని ఖరారు చేసి అమలు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఈ మార్పులు అమలులోకి వస్తే, దేశ రక్షణ సామర్థ్యం మరింత బలపడటంతో పాటు, కొనుగోలు వ్యవస్థలో పారదర్శకత, వేగం పెరిగే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





- ప్రజలే నా బలం,బలగం
- ఎమ్మెల్యే కడియం,ఎంపి కావ్య సహకారంతో వార్డు అభివృద్ధి చేస్తా
- వార్డులోని ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం
- కాంగ్రెస్ పార్టీ 1వ వార్డు అభ్యర్థి సింగపురం దయాకర్

# నేను నాయకుడిని కాదు, మీ సేవకుడిని..!

**స్టేషన్ ఘనపూర్, ఫిబ్రవరి03(తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజల ఆశీస్సులే తన బలమని, ఎప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వార్డు అభివృద్ధికి అంకితంగా పనిచేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సింగపురం దయాకర్ తెలిపారు. స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీ లోని ఒకటో వార్డు నుంచి కౌన్సిలర్ ఎన్నికల బరిలో ఉన్న ఆయన, స్థానిక సమస్యలపై పూర్తి అవగాహనతో ప్రజల మన్నన పొందిన నాయకుడిగా గుర్తింపు పొందుతున్నారు.

ఎన్నో ఏళ్లుగా ప్రజలతో మమేకమై పని చేస్తూ తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుధ్యం వంటి మౌలిక సమస్యలపై లోతైన అవగాహనతో ముందుకుసాగుతున్న దయాకర్, సమస్య ఎక్కడ ఉందో చెప్పాల్సిన అవసరం లేకుండానే ప్రజల కష్టాలను ముందే గుర్తించి స్పందించే నేతగా పేరు సంపాదించారు. ప్రజలు పిలిస్తే ఆప్యాయంగా పలకరిస్తూ, ప్రతి ఒక్కరి మాట వినే వ్యక్తిగా ఆయనకు వార్డులో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది.





దయాకర్‌కు రాజకీయ అనుభవం కొత్తది కాదు. ఇప్పటికే స్టేషన్‌ఘన్‌పూర్ పరిధిలో రెండు పర్యాయాలు ఎంపీటీసీగా గెలుపొందిన ఆయన, ఆ కాలంలో ప్రజల సమస్యల పరిష్కారానికి చురుకుగా పనిచేశారు. క్షేత్రస్థాయిలో పరిపాలనా అనుభవం ఉండటంతో పాటు ప్రభుత్వ వ్యవస్థల పనితీరుపై స్పష్టమైన అవగాహన కలిగిన నాయకుడిగా ఆయనకు పేరు ఉంది. ఈ అనుభవమే ఇప్పుడు ఒకటో వార్డు అభివృద్ధికి ఉపయోగపడుతుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుసుకున్న దయాకర్, వార్డులోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరోసారి ప్రజలు ఆశీర్వదిస్తే వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని స్పష్టం చేశారు. అధికార పార్టీ అండతో పాటు స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య సహకారంతో ఒకటో వార్డును ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దుతానని తెలిపారు.

వార్డులోని ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే తన లక్ష్యమని పేర్కొన్న దయాకర్, తాగునీటి సరఫరా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటానని, వీధిదీపాల నిర్వహణను నిత్యం పర్యవేక్షిస్తానని చెప్పారు. ప్రతి వీధికి సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తానని వెల్లడించారు.

వృద్ధులు, దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరేలా చూస్తానని దయాకర్ తెలిపారు. యువతలోని క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు ప్రత్యేకంగా ప్రోత్సహిస్తానని, ఎలాంటి పక్షపాతం లేకుండా పారదర్శక పాలన అందిస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే కౌన్సిలర్‌గా పనిచేస్తానని, ఉత్తమ వార్డు నిర్మాణం కోసం నిజాయితీగా కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# యుద్ధాలు, హింసే వలసలకు కారణం





- శరణార్థుల సంక్షోభం.. మానవత్వం ఓడిపోతుందా?
- సరిహద్దుల వద్ద మూసుకుపోతున్న దయ
- ప్రపంచ బాధ్యత.. పరిష్కారం ఎక్కడ?

ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శరణార్థులుగా మారడానికి ప్రధాన కారణం యుద్ధాలు, అంతర్గత ఘర్షణలు, మత-జాతి హింస. సిరియా, గాజా, సూడాన్, మయన్మార్, ఆఫ్ఘానిస్తాన్ వంటి ప్రాంతాల్లో కొనసాగుతున్న అశాంతి లక్షల కుటుంబాలను స్వదేశాల నుంచి తరిమేసింది. ఒకప్పుడు ఇంటి ముంగిట నవ్వులు, పండుగలు ఉన్న చోట ఇప్పుడు బాంబుల శబ్దాలు, తుపాకుల మోతలు. ప్రాణాలు కాపాడుకోవడమే లక్ష్యంగా ప్రజలు సరిహద్దులు దాటి పరదేశాలకు పారిపోతున్నారు. ఈ ప్రయాణంలో ఆహారం, నీరు, వైద్యం లేక అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు, మహిళలు అత్యంత బలహీనంగా మారుతున్నారు. శరణార్థుల సంఖ్య పెరుగుతున్న కొద్దీ అనేక దేశాలు సరిహద్దులు మూసేస్తున్నాయి. "జాతీయ భద్రత", "ఆర్థిక భారం" పేర్లతో ఆశ్రయం నిరాకరిస్తున్న దృశ్యాలు పెరుగుతున్నాయి. ఒకవైపు మానవ హక్కులపై ప్రసంగాలు, మరోవైపు



శరణార్థులపై అనుమానాలు ఇది ఆధునిక ప్రపంచం ఎదుర్కొంటున్న పెద్ద విరోధాభాసం. పడవల్లో సముద్రాలు దాటుతూ మునిగిపోతున్న కుటుంబాలు, శిబిరాల్లో సంవత్సరాల తరబడి ఆశ లేకుండా బతుకుతున్న పిల్లలు... ఇవన్నీ ప్రపంచ సమాజాన్ని ప్రశ్నిస్తున్నాయి. మానవత్వం మాటల్లో మాత్రమే మిగిలిపోయిందా అన్న సందేహం ఇక్కడే మొదలవుతుంది.

ప్రపంచ బాధ్యత ఎవరిది?

శరణార్థుల సమస్య ఒక్క దేశానికో ప్రాంతానికో పరిమితం కాదు. ఇది గ్లోబల్ బాధ్యత. ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ సంస్థలు సహాయ చర్యలు చేపడుతున్నా, వాటి సామర్థ్యం పరిమితమే. ధనిక దేశాలు బాధ్యతను పేద దేశాలపై నెట్టేయడం వల్ల శిబిరాలు కిక్కిరిసి మానవీయ సంక్షోభం మరింత తీవ్రమవుతోంది. శరణార్థులను భారం కాకుండా మానవ వనరులుగా చూడగలిగితే పరిస్థితి మారుతుంది. విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారు కొత్త దేశాల అభివృద్ధికి తోడ్పడగలరు. మానవత్వం నిలబడాలంటే.. ఈ సంక్షోభానికి పరిష్కారం యుద్ధాల నివారణ నుంచే మొదలవ్వాలి. శాంతి చర్చలు, దౌత్యం, అంతర్జాతీయ ఒత్తిడి ద్వారా హింసను ఆపాల్సిందే. అదే సమయంలో శరణార్థులకు గౌరవప్రదమైన జీవితం కల్పించాలి. "వాళ్లు మనవాళ్లే" అనే భావనతో ప్రపంచం ఒక్కటై ముందుకు సాగితేనే మానవత్వం ఓడిపోదు. లేకపోతే, చరిత్ర మనల్ని నిర్దాక్షిణ్యంగా ప్రశ్నిస్తుంది——కష్టకాలంలో మనం మానవులుగా నిలిచామా, లేక గోడలు కట్టుకున్నామా?

# ఆరోగ్య అవగాహన దినం – జీవనశైలే నిజమైన ఔషధం

ఆరోగ్యం అంటే జబ్బు రాకపోవడమే అన్న భావన ఇప్పటికీ చాలా మందిలో ఉంది. కానీ నిజానికి ఆరోగ్యం అనేది సంపూర్ణ శారీరక, మానసిక, సామాజిక సంక్షేమం. జబ్బు వచ్చిన తర్వాత ఆసుపత్రి చుట్టూ తిరగడం ఆరోగ్య సంరక్షణ కాదు; జబ్బే రాకుండా చూసుకోవడమే నిజమైన జాగ్రత్త. ఆరోగ్య అవగాహన దినం మనకు ఇదే విషయం గుర్తుచేస్తుంది. రోజువారీ జీవనంలో మనం తీసుకునే చిన్నచిన్న నిర్ణయాలే దీర్ఘకాలంలో మన ఆరోగ్యాన్ని నిర్ణయిస్తాయి. సమయం లేదని, అవసరం లేదని ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తే, చివరికి అదే మన సమయాన్ని, శక్తిని, డబ్బును ఎక్కువగా తీసుకుంటుంది. జీవనశైలి మార్పే కీలకం ఈ రోజుల్లో ఎక్కువగా కనిపిస్తున్న మధుమేహం, రక్తపోటు, గుండె జబ్బులు, స్థూలకాయం వంటి సమస్యలకు ప్రధాన కారణం జీవనశైలి. కూర్చునే పనులు, వ్యాయామం లేకపోవడం, అధిక ఒత్తిడి, అనియమిత నిద్ర - ఇవన్నీ మన శరీరాన్ని నెమ్మదిగా బలహీనంగా మారుస్తున్నాయి. ఆరోగ్యంగా ఉండాలంటే పెద్ద త్యాగాలు అవసరం లేదు. రోజుకు కొద్దిసేపు నడక, సరైన సమయంలో భోజనం, తగినంత నిద్ర, పనితో పాటు శరీరానికి కూడా సమయం కేటాయించడం చాలానే మార్పు తీసుకొస్తాయి. కానీ సమస్య ఏమిటంటే - ఈ మార్పులు రేపటికి వాయిదా వేస్తూనే ఉండటం. ఆహారమే ఆరోగ్యానికి పునాది మన శరీరానికి అవసరమైన శక్తి ఆహారంతోనే వస్తుంది. అయినా సరే, ఆహారం విషయంలో మనం అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాం. రుచికి ప్రాధాన్యం ఇచ్చి, పోషక విలువలను విస్మరిస్తున్నాం. ప్యాకెట్ ఆహారం, అధిక కొవ్వు, చక్కెర, ఉప్పు కలిగిన పదార్థాలు ఆరోగ్యాన్ని మెల్లగా దెబ్బ తీస్తున్నాయి. సంప్రదాయ ఆహారం, కూరగాయలు, పండ్లు, పప్పులు వంటి సహజ పదార్థాలు మన శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తాయి. ఆరోగ్య అవగాహన దినం సందర్భంగా ఆహారంపై పునరాలోచన చేయాల్సిన అవసరం ప్రతి ఒక్కరికీ ఉంది. వ్యాయామం - ఐచ్ఛికం కాదు, అవసరం వ్యాయామం అంటే కేవలం జిమ్‌కు వెళ్లడమే అన్న భావన చాలా మందిలో ఉంది. కానీ వ్యాయామం అనేది శరీరాన్ని కదిలించడమే. నడక, మెట్లు ఎక్కడం, ఇంటి పనులు చేయడం, యోగ, ధ్యానం - ఇవన్నీ వ్యాయామమే. రోజుకు కనీసం అరగంట శరీరానికి కేటాయిస్తే అనేక రకాల జబ్బులను దూరం పెట్టవచ్చు. వ్యాయామం శరీరానికే కాదు, మనసుకూ శాంతిని ఇస్తుంది. ఒత్తిడిని తగ్గించి, ఆలోచనలను స్పష్టంగా ఉంచడంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. మానసిక ఆరోగ్యానికీ సమాన ప్రాధాన్యం ఆరోగ్యం అంటే శరీరం మాత్రమే కాదు. మానసిక ఆరోగ్యం కూడా అంతే ముఖ్యం. నిరంతర ఒత్తిడి, ఆందోళన, భయాలు మన శరీర ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తాయి. మాట్లాడే అవకాశం లేకపోవడం, భావాలను లోపలే దాచుకోవడం అనేక సమస్యలకు దారితీస్తుంది. కుటుంబంతో, స్నేహితులతో మాట్లాడటం, అవసరమైతే నిపుణుల సహాయం తీసుకోవడం బలహీనత కాదు - అది బాధ్యత. ఆరోగ్య అవగాహన దినం మానసిక ఆరోగ్యం గురించిన మౌనాన్ని కూడా విరగదీయాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తుంది. ప్రభుత్వాలు, వైద్య వ్యవస్థలు ఎంత ప్రయత్నించినా, ఆరోగ్యాన్ని కాపాడుకోవాల్సిన ప్రధాన బాధ్యత వ్యక్తిగతంగానే ఉంటుంది. "నాకు ఏమీ కాలేదు" అనే ధోరణి కాకుండా, "నాకు ఏమీ కాకుండా చూసుకోవాలి" అనే ఆలోచన రావాలి. ఆరోగ్య అవగాహన దినం ఒక రోజుకు పరిమితం కాకూడదు. అది మన జీవన విధానంలో మార్పుకు ఆరంభం కావాలి. ఆరోగ్యాన్ని విలువగా భావించిన రోజే, నిజమైన అభివృద్ధి దిశగా మన సమాజం అడుగులు వేసిన రోజు అవుతుంది.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in